నేడు, రేపు టిటిడి మొబైల్‌ఫోన్ల 'ఈ'వేలం

ప్రజాశక్తి - తిరుమల

తిరుమల శ్రీవారి ఆలయంతోపాటు ఇతర అనుబంధ ఆలయాలకు భక్తులు కానుకగా సమర్పించిన ఉపయోగించినవి / పాక్షికంగా దెబ్బతిన్న 74 లాట్ల మొబైల్ ఫోన్లను జూన్ 20 నుండి 21వ తేదీ వరకు టిటిడిలో ఆన్ లైన్ ద్వారా ఈ - వేలం వేయనున్నారు. ఆసక్తి కల్గిన ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఈ - కొనుగోలు పోర్టల్ లో రిజిస్టర్ అయిన బిడ్డర్లు వేలంలో పాల్గొనటానికి అర్హులు. ఇతర వివరాలకు 0877 - 2264429 ఫోన్ నెంబర్ ద్వారా సంప్రదించాల్సి ఉంది.

తక్కువ ధర చెల్లించారని...

రెండు ర్యాంపులపై చర్యలు

✓దామలచెరువులో కలెక్టర్ పర్యవేక్షణ ✓ఫిర్యాదుతో పోలీసు కేసు నమోదు ✗కనీసం రూ.4కు కొనాలని భిన్నంగా ఆదేశం

ప్రజాశక్తి - రామచంద్రాపురం (పాకాల)

తోతాపురి మామిడి రైతులకు తక్కువ ధర చెల్లించే ర్యాంపుదారులపై కఠినచర్యలు తీసుకుంటామని కలెక్టర్ డాక్టర్ ఎస్. వెంకటేశ్వర్ హెచ్చరించారు. గురువారం సాయంత్రం దామల్ చెరువు వద్ద గల ర్యాంపులను పరిశీలించారు. ఈ సందర్భంగా ర్యాంపుల వద్ద ఉన్న రైతులతో ర్యాంపుదారులు చెల్లిస్తున్న ధరలపై జిల్లా కలెక్టర్ ఆరా తీశారు. ర్యాంపుదారులు తమ వద్ద నుంచి కేజీ మూడు రూపాయలు చొప్పున కొనుగోలు చేస్తున్నారని కలెక్టర్ దష్టికి తీసుకువచ్చారు. వెంటనే రైతుల వద్ద ఫిర్యాదు తీసుకొని ర్యాంపుదారులపై పోలీస్ కేసు నమోదు చేయాలని కలెక్టర్ అక్కడే ఉన్న సిఐ ని ఆదేశించారు. అంతేకాక తానే దగ్గరుండి ఫిర్యాదును రాయించి జిల్లా కలెక్టర్ రైతులతో సంతకం చేయించారు. వెంటనే సోలాపూర్ ర్యాంపుదారునిపై చర్యలు తీసుకోవాలని పోలీసు వారిని ఆదేశించారు. ఇకపై ఏ ర్యాంపుదారుడు అయినా కనీసం నాలుగు రూపాయలకు తగ్గకుండా తోతాపురి మామిడి కాయలను కొనుగోలు చేయాలని, అలా చేయకుంటే వారి ర్యాంపులను సీజ్ చేసి కేసులు బుక్ చేయడం జరుగుతుందని ప్రభుత్వ నిర్ణయానికి భిన్నంగా కలెక్టర్ ఆదేశాలు జారీ చేయడం గమనార్హం. ప్రతి రాంపు వద్ద విఆర్వోలను, పోలీస్ కానిస్టేబుల్ ను తప్పనిసరిగా ఉంచేలా చర్యలు తీసుకోవాలన్నారు. వారు రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా రైతులకు తక్కువ ధర చెల్లించకుండా చూడాలన్నారు. అనంతరం దామల చెరువులోని జి ఎస్ కే సి ఎం ఎన్ రాంపును పరిశీలించారు. అక్కడే ఉన్న రైతులు రాంపుదారుడు కొంతమంది ట్రేడర్స్ తో కలిసి సిండికేట్ గా మారి టన్నుకు 25 కేజీలచొప్పున సూట్ ను కూడా రైతుల వద్ద నుంచి వసూలు చేస్తున్నారని కలెక్టర్ దష్టికి తీసుకువచ్చారు. ఎవరు కూడా రైతుల నుంచి సూట్ ను వసూలు చేయరాదని అలాంటి వారిపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. రాంపు నుండి గురువారం ఉదయం మామిడికాయలను తోలిన రైతు ఎం భాస్కర్ రెడ్డితో జిల్లా కలెక్టర్ ఫోన్‌లో మాట్లాడి ఏ ధరకు మామిడికాయలను అందజేశారు తెలుపమని కోరగా వారు కేజీ మూడు రూపాయలు చొప్పున మామిడికాయలను అమ్మడం జరిగిందని కలెక్టర్ కు తెలిపారు. వెంటనే జి ఎస్ కే సి ఎం ఎన్ రాంపుయజమాని పైనా జిల్లా కలెక్టర్ కేసును నమోదు చేయించారు.



రైతుల నుంచి ఫిర్యాదు స్వీకరిస్తున్న కలెక్టర్

కలెక్టర్ మాట్లాడుతూ ప్రతి చివరి మామిడికాయ వరకు రైతుల వద్ద నుంచి కొనుగోలు చేయడం జరుగుతుందని, ఎవరు ఆందోళన చెందాల్సిన పని లేదన్నారు రాష్ట్ర ప్రభుత్వం ప్రతి రైతుకు కేజీకి నాలుగు రూపాయలు చొప్పున సబ్సిడీని అందజేస్తుందని ఆ మొత్తాలను రైతుల ఖాతాలకు నేరుగా జమ చేస్తుందన్నారు.ఎక్కడ కూడా ప్రభుత్వం ఎకరాల పరిమితి విధించలేదని, రైతుల వద్ద ఎంత పంట ఉంటే అంత పంటను జిల్లాలోని పల్ప్ ఇండస్ట్రీలకు అందించవచ్చని తెలిపారు. తోతాపూరి మామిడికాయ రైతులకు ఏవైనా సమస్యలు ఉంటే టోల్ ఫ్రీ నెంబర్ 0877 2236007 నకు ఫోన్ చేసి తెలపాలని జిల్లా కలెక్టర్ రైతులకు సూచించారు.

పాకాల మండలం రామిరెడ్డి ఇండ్లు గ్రామం, ఉప్పరపల్లి గ్రామపంచాయతీలోని సుప్రీం క్వాలిటీ ఫుడ్స్ ప్రైవేట్ లిమిటెడ్ జిల్లా కలెక్టర్ తనిఖీ చేశారు అక్కడే ఉన్న రైతుల తో జిల్లా కలెక్టర్ మాట్లాడారు. ముందుగా వచ్చిన వారికి ముందుగా టోకెన్ జారీ చేయాలని, అలాగే వారి పేరు వారి ఊరు వారి ఫోన్ నెంబర్ తదితర వివరాలను రిజిస్టర్లలో నమోదు చేయాలని ఎక్కడ కూడా డూప్లికేషన్ లేకుండా చూడాలని ఉద్యానవన సిబ్బందిని జిల్లా కలెక్టర్ ఆదేశించారు. అక్కడే ఉన్న కంప్యూటర్లో నమోదు చేసిన రైతుల వివరాలను జిల్లా కలెక్టర్ పరిశీలించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉద్యాన శాఖ అధికారి దశరథరామి రెడ్డి, పాకాల తహసిల్దార్ సంతోష్ సాయి, హార్టికల్చర్ అధికారి శైలజ పాల్గొన్నారు.

రోడ్డుకు అడ్డంగా గోడ

శిరసనంబేడు గ్రామస్తుని వినూత్న నిరసన
ఎటూ తేల్చని అధికారులు
హామీలు నెరవేర్చని 'అమ్మన్ ట్రే' కంపెనీ

ప్రజాశక్తి - పెళ్లకూరు

కంపెనీ హామీలు నెరవేర్చలేదంటూ రోడ్డుకు అడ్డంగా గోడ కట్టి నిరసన

పెళ్లకూరు మండలం శిరసనంబేడు పంచాయతీలో వారం రోజులుగా రహదారికి అడ్డంగా కట్టిన గోడ విషయమై రాజకీయంగానూ, ప్రజల మధ్య పెద్ద దుమారం చెలరేగింది. అయితే అధికారులు ఎటూ తేల్చకుండా వివాదం ముదిరేలా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుండటం విమర్శలకు దారితీస్తోంది. అమ్మన్ ట్రే కంపెనీ ప్రారంభం సందర్భంగా ఇచ్చిన హామీలేవి నెరవేర్చకుండా కర్మాగారం నిమ్మకు నీరెత్తినట్లు ఉండటమే కారణమని తెలుస్తోంది.

శిరసనంబేడు పంచాయతీ రహదారిలో అమ్మన్‌ట్రే కర్మాగారం, క్రషర్ మొదలైన వాహనాలు అనుమతులకు మించి రాత్రీపగలు ప్రయాణించడం వల్ల గ్రామ ప్రజలకు శబ్దకాలుష్యంతో పాటు, దుమ్ము ఇళ్లల్లోకి, షాపుల్లోకి వస్తోంది. వాహనాల పొగ వల్ల శ్వాససంబంధిత వ్యాధులొస్తున్నాయని గ్రామస్తులు వాపోతున్నారు. ఉదయం 7.30 గంటలకు పాఠశాలలకు విద్యార్థులు నడచి వెళ్లాలన్నా, స్కూలు వాహనాలకు, వ్యవసాయ పరికరాలు తీసుకెళ్లే వాహనాలకు ఈ భారీ వాహనాల వల్ల ఇబ్బందిగా ఉందన్నారు. ఎక్కువ బరువు కలిగిన వాహనాలు రావడం వల్ల రహదారులు దెబ్బతింటున్నాయని గ్రామస్తులు గురువారం ఉదయం వాహనాలను అడ్డుకున్నారు.

మా భూమికి మార్కెట్ వ్యాల్యూ ఇవ్వలేదు

వేలూరు ముళ్ల మురళీక్రిష్ణారెడ్డి

రోడ్డుకు అడ్డంగా గోడ నిర్మించింది వాస్తవమే. సర్వే నంబర్ 149 -3 నందు 1 ఎకరా 95 సెంట్లు భూమి మా పిత్రార్జితం. ఫ్యాక్టరీ నిర్మాణం సమయంలో హైవే పనులు జరుగుతున్న సమయంలో రెండు కంపెనీల మేనేజర్లు మా దగ్గరకు వచ్చి స్థానికులకు ఉద్యోగాలు ఇస్తామని, రోడ్డుకు ఇచ్చిన భూమికి మార్కెట్ వ్యాల్యూ కల్పిస్తామని హామీ ఇచ్చారు. టిడిపి నాయకుడిని అయినందున ప్రజా శ్రేయస్సు దృష్ట్యా ఏళ్ల తరబడి దారి ఇచ్చాను. అయితే కంపెనీ వారు స్థానికులకు ఉద్యోగాలు కల్పించలేదు. మా భూమికి ఇస్తామన్న వాల్యూ ఇవ్వలేదు. ఉమ్మడి కుటుంబ ఆస్తి కావడంతో కుటుంబ సభ్యులు ఒప్పుకోకపోవడంతో మార్కెట్ వాల్యూ ప్రకారం అమౌంట్ ఇచ్చి, అర్హులకు ఉద్యోగాలు కల్పిస్తేనే, ప్రజా శ్రేయస్సు దృష్ట్యా దారి ఇవ్వగలము.

త్వరలోనే సమస్యను పరిష్కరిస్తాం : తహశీల్దార్

సంఘటనా స్థలానికి చేరుకుని వివరాలను సేకరించాం. ఇరు వర్గాల వారితోనూ, గ్రామస్తులతోనూ మాట్లాడి త్వరలోనే సమస్యను పరిష్కరిస్తాం.

ఎస్‌టిలకు చదువు దూరం చేయొద్దు

ప్రజాశక్తి - తిరుపతి టౌన్

చంద్రగిరి నియోజకవర్గం రామచంద్రపురం మండలం ప్రసన్న వెంకటేశ్వరపురం పరమాల గ్రామంలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలను ఆదర్శ పాఠశాల పేరుతో విలీనం చేసే ఆలోచన విరమించుకోవాలని సిపిఎం, ఎస్ఎఫ్ఐ, ఐద్వా ఆధ్వర్యంలో తిరుపతి జిల్లా కలెక్టర్‌కు గురువారం వినతిపత్రం సమర్పించారు. నాయకులు ఎస్.జయచంద్ర, కె.సుమన్, పి.సాయిలక్ష్మి, వినోద్‌కుమార్, తేజ మాట్లాడుతూ పివిపురం మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలను బలిజిపల్లి గ్రామంలోని మోడల్ స్కూల్లో విలీనం చేశారన్నారు. దీనివల్ల రామిరెడ్డిపల్లి, ఎస్టీకాలనీ గంగమాంబపురం, పివిపురం గ్రామాల నుంచి విద్యార్థులు రాష్ట్ర రహదారిపై నడిచి వెళ్లాల్సి వస్తోందన్నారు. రోడ్డు దాటే సమయంలో ప్రమాదవశాత్తు ప్రమాదం జరిగితే తమ బిడ్డలకు భద్రత ఏంటని, పివిపురంలోనే మోడల్ స్కూలు ఏర్పాటు చేసేందుకు మూడున్నర ఎకరా స్థలం ఉందని పేర్కొన్నారు. స్కూల్లో 40 మంది విద్యార్థులు ఉన్నారని, వీరిలో 22 మంది ఎస్టీ కాలనీ పిల్లలు ఉన్నారని తెలిపారు. వీరంతా పాఠశాలకు దూరమయ్యే ప్రమాదం ఉందని, ప్రభుత్వం పునరాలోచన చేయాలని విజ్ఞప్తి చేశారు.

ఎర్రచందనం స్మగ్లరుకు ఐదేళ్ల జైలు శిక్ష

ప్రజాశక్తి - తిరుపతి (మంగళం)

ఎర్రచందనం అక్రమ రవాణా చేస్తూ పట్టుబడిన స్మగ్లరుకు ఐదేళ్ల జైలు శిక్ష, రూ. 6లక్షల జరిమానా విధిస్తూ ఆర్ఎస్ఎస్ ఏడీజే కోర్టు న్యాయమూర్తి నరసింహమూర్తి గురువారం తీర్పు నిచ్చారు. క్రైమ్ నెంబరు 74/2017 కేసులో ఒక ముద్దాయి అరెస్టయ్యాడు. ఇతను తమిళనాడుకు చెందిన పరమన్ అన్బు కాగా, ఎర్రచందనం అక్రమ రవాణా చేస్తూ కరకంబాడీ ఫారెస్ట్ బీటు, కష్ణాపురం సెక్షన్ తిరుపతి లో పట్టుబడ్డాడు. ఇతని నేరం రుజువు కావడంతో న్యాయమూర్తి స్మగ్లరుకు ఐదేళ్ల జైలు శిక్ష, రూ. 6లక్షల జరిమానా విధిస్తూ తీర్పునిచ్చారు. తదుపరి కోర్టు ఆదేశాలు మేరకు అతనిని నెల్లూరు సెంట్రల్ జైలులో అప్పగించారు.

శ్రీవారి సేవలో తెలంగాణ కార్మికశాఖ మంత్రి వివేక్

ప్రజాశక్తి-తిరుమల

తెలంగాణ కార్మిక శాఖ మంత్రి గడ్డం వివేక్ వెంకటస్వామి తిరుమల శ్రీవారిని దర్శించుకున్నారు. మంత్రి బాధ్యతలు స్వీకరించిన అనంతరం శ్రీవారి దర్శనార్థం తిరుమలకు వచ్చానని పేర్కొన్నారు. తెలంగాణ ఆర్థిక పరిస్థితి మెరుగుపడాలని, సంక్షేమ పథకాలు అమలు కావాలని కోరుకున్నట్లు తెలిపారు. ఇందిరమ్మ ఇళ్ల కోసం ప్రజలు ఎదురుచూస్తున్నారని తెలిపారు. ఇందిరమ్మ పక్కా ఇళ్లుకట్టిస్తే 12 ఏళ్ల తెలంగాణ ప్రజల కల నెరవేరుతుందని పేర్కొన్నారు. రైతు భరోసా, 200 యూనిట్ల ఉచిత విద్యుత్, రాజీవ్ ఆరోగ్య శ్రీ, సన్నబియ్యం వితరణతో ప్రజలు సంతోషంగా ఉన్నారని ఆయన వివరించారు.

'పల్లం' పాఠశాలలో శ్రీలంక ప్రతినిధులు

ప్రజాశక్తి- ఏర్పేడు

భారతదేశంలోని విద్యావ్యవస్థను అభ్యసించడానికి శ్రీలంక దేశానికి చెందిన 45 మంది విద్యావేత్తలు ఏర్పేడు మండలంలోని పల్లాం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను గురువారం సందర్శించారు. పల్లాం పాఠశాలలోని బోధన విధానాన్ని, ఉపాధ్యాయుల పనితీరును, అమలవుతున్న బోధనాపద్ధతులను పరిశీలించి సంతప్తి వ్యక్తం చేశారు. పాఠశాలలో ప్రభుత్వం, ప్రైవేటు వ్యక్తులచే సమకూర్చబడిన వసతులను పరిశీలించారు. ఆంగ్ల ఉపాధ్యాయులు వెంకటరత్నం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆధ్వర్యంలో పనిచేయుచున్న పాఠశాలల్లో విద్యా విధానాన్ని వారికి వివరించారు. పాఠశాలలో విద్యార్థుల ప్రతిభను చూసి ప్రశంసించారు. శ్రీలంక ప్రతినిధులు మహేందర్, ఫెరారీ లు మాట్లాడుతూ భారతదేశంలో విద్యా వ్యవస్థ పటిష్టంగా ఉందని, ప్రభుత్వ సహకారం బాగుందని, పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఆనంద్ సమాజం నుండి విరాళాలు సేకరించి పాఠశాను అభివద్ధి చేయడం బాగుందని ప్రశంశించారు. శ్రీలంక మహిళా ఉపాధ్యాయులందరూ శ్రీలంకకు చెందిన సాంస్కతిక కార్యక్రమాలను డాన్సులు ద్వారా విద్యార్థులను ఉత్తేజపరిచారు. అనంతరం పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఆనంద్ శ్రీలంక ప్రతినిధులను ఘనంగా సన్మానించారు. ఈ నేపథ్యంలో శ్రీలంక ప్రతినిధులు ప్రధానోపాధ్యాయులకు మెమెంటో బహుకరించారు. ఈ కార్యక్రమంలో శ్రీనివాసులు, బాబు, సోమశేఖర్, వాణి, విజయ శేఖర్, వెంకటరామయ్య తదితరులు పాల్గొన్నారు.

భక్తుల నుండి అభిప్రాయ సేకరణ : ఈవో

ప్రజాశక్తి -తిరుమల



శ్రీవారి భక్తులకు తిరుమల తిరుపతి దేవస్థానం అందిస్తున్న సేవలపై క్రమం తప్పకుండా అభిప్రాయ సేకరణ ప్రామాణికంగా మరింత మెరుగైన సేవలు అందించేందుకు చర్యలు చేపట్టామని టిటిడి ఈవో జె. శ్యామల రావు తెలిపారు. టిటిడి పరిపాలనా భవనంలోని సమావేశ మందిరంలో భక్తుల నుంచి సేకరించిన అభిప్రాయ సేకరణపై వివిధ విభాగాల అధిపతులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఈవో మాట్లాడుతూ శ్రీవారి దర్శనం, అన్నప్రసాదాలు, వడ పంపిణీ, వసతి, కాలినడక భక్తులకు అందుతున్న సేవలు, లగేజీ, కళ్యాణకట్ట, వైద్యం, పారిశుధ్యం, పరిశుభ్రత, విజిలెన్స్, ట్రాన్స్ ఫోర్ట్ తదితర అంశాలపై భక్తుల నుండి ఎప్పటికప్పుడు ఫీడ్ బ్యాక్ తీసుకుంటున్నామని, భక్తుల అభిప్రాయాలను పరిగణలోకి తీసుకుని మరింత మెరుగైన సేవలు అందించేందుకు చర్యలు చేపట్టామన్నారు. శ్రీ మాతశ్రీ తరిగొండ అన్నప్రసాద భవనంలో పెరుగుతున్న భక్తుల రద్దీ దష్ట్యా అదనపు హాళ్లను అందుబాటులోకి తీసుకువచ్చేందుకు సాధ్యాసాధ్యాలను పరిశీలించాలని అధికారులను సూచించారు. భక్తులకు అన్నప్రసాదాల పంపిణీలో ఆలస్యం చేయకుండా క్రమపద్ధతిలో పంపిణీ చేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. బియ్యం, వంట సరుకుల నాణ్యత పరీక్షించేందుకు ఆధునిక పరికరాలను ఉపయోగించి భక్తులకు మరింత రుచికరమైన అన్నప్రసాదాలను అందించాలని కోరారు. వసతి గహాలలో సకాలంలో పరిశుభ్రతా ప్రమాణాలను పాటించేందుకు వీలుగా రిసెప్షన్, ఐటీ విభాగాలు సమన్వయంతో ఎఫ్.ఎమ్. ఎస్ యాప్ ను అందుబాటులోకి తీసుకురావాలని సూచించారు. రద్దీకి తగ్గట్టుగా లడ్డూ కౌంటర్లలో సిబ్బందిని నియమించాలన్నారు. ఈకార్యక్రమంలో వర్చువల్ ద్వారా అదనపు ఈవో సిహెచ్ వెంకయ్య చౌదరి, తిరుపతి పరిపాలనా భవనం నుండి జేఈవో వి. వీరబ్రహ్మం, సివిఎస్వో మురళీ కష్ణ, సీఈ టివి సత్యనారాయణ పాల్గొన్నారు.

వివాద భూమిలోకి ఎవ్వరూ రావద్దు: రెవెన్యూ

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం)

మంగళం పరిధిలోని న్యూ మంగళం గ్రామపంచాయతీ మంగళం గ్రామ లెక్క దాఖలా సర్వేనెంబర్ 52/2బి ఉన్న భూమిలో గురువారం తమకు ఈ భూమిపై హక్కులు ఉన్నాయంటూ రెండు గ్రూపుల వారు స్థలం వద్దకు చేరుకోవడంతో రెవెన్యూ అధికారులు అడ్డుకొని, స్థల వివాదం ఉన్నందున ఎవరూ రావద్దని హెచ్చరించారు. స్థానిక వీఆర్వో సతీష్ సమాచారం మేరకు ప్రస్తుతం సర్వే నెంబర్ 52/2బి లో ఉన్న ఎ3.86 సెంట్ల భూమికి సంబంధించి జాయింట్ కలెక్టర్ కోర్టులో వాజ్యం నడుస్తోంది. జెసి కోర్టులో విచారణ పూర్తయి తుది తీర్పు వచ్చేంతవరకు ఎవరు ఇందులో ఎటువంటి నిర్మాణాలను, ప్రవేశాలను చేయకూడదని స్పష్టం చేశారు. దీంతో ఇరు వర్గాలకు చెందిన వారు అక్కడ నుండి వెళ్లిపోయారు.

ఆ 'సీవో' మాకొద్దంటూ ఆర్పీల ఆందోళన

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి మున్సిపాలిటీలోని మెప్మా శాఖలో 1 నుండి 13వ వార్డు వరకు బాధ్యులుగా ఉన్న సీవో మాకొద్దని ఆ వార్డుల పరిధిలో పనిచేస్తున్న ఆర్పీలు అన్నారు. సంఘటిత ఆర్పీలు గురువారం ఆ సీవోపై మెప్మా టీఎంసీకి ఫిర్యాదు చేశారు. సమాఖ్యలు, సంఘాలు, సభ్యుల అభివద్ధికి సీవో తోడ్పాటునందించడం లేదని వాపోయారు. సహచర సీవోలు సంఘాలకు బ్యాంకుల ద్వారా విరివిగా రుణాలు అందిస్తున్నా, తమ సీవో మాత్రం 'మహిళా ఆకాష్ యాప్ పేరిట' పనులు పెండింగ్ పెడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషయంపై సదరు సీవోను వివరణ కోరగా పలు సమాఖ్యల ద్వారా బ్యాంకులకు సక్రమంగా రుణాలు జమ కావడం లేదనీ, ఆ సమాఖ్యల బాధ్యుడిగా రుణాలు సకాలంలో కట్టమన్నందుకు తనపై ఈ తరహా ఆరోపణలు చేస్తున్నారని వివరణ ఇచ్చారు. తాను బాధ్యతలు చేపట్టిన తొమ్మిది నెలల కాలంలోనే రూ.1.10 కోట్లు బ్యాంకు లింకేజీలు చేసినట్లు చెప్పారు.

కేంద్రీయ విద్యాలయంలో అడ్మిషన్లకు ఆహ్వానం

ప్రజాశక్తి - ఏర్పేడు ఏర్పేడు ఐఐటి కేంద్రీయ విద్యాలయంలో పలు తరగతుల్లో ఖాళీలను భర్తీ చేయడానికి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ఇన్చార్జ్ ప్రిన్సిపాల్ రమేష్ బజ్జూరి ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తిగల విద్యార్థుల తల్లి తండ్రులు దరఖాస్తు చేసుకోవడానికి జూన్ 21 నుండి 25 వరకు ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 4గంటల మధ్య పాఠశాలను నేరుగా సంప్రదించవచ్చునని తెలిపారు. 1వ తరగతిలో 01-ఎస్.టి, 01 సి డబ్ల్యు ఎస్ ఎన్ , 2వ తరగతిలో 01-ఎస్.టి, 3వ తరగతిలో 01-ఎస్.టి, 4వ తరగతిలో 26, 5వ తరగతిలో 01-ఎస్.సి, 01- ఎస్.టి అందుబాటులో ఉన్నాయని తెలిపారు.

లిటిల్ ఏంజెల్ స్కూల్ విద్యార్థికి 'ఎక్స్‌లెన్స్' అవార్డు

ప్రజాశక్తి -తిరుపతి సిటీ

తిరుపతి లిటిల్ ఏంజెల్ స్కూల్ విద్యార్థిని ఆర్. రెడ్డి గీతిక జాతీయస్థాయి ఎక్స్ లెన్స్ అవార్డును అందుకుంది. ఈ సందర్భంగా స్కూల్ డైరెక్టర్ శ్వేతా రెడ్డి మాట్లాడుతూ టీసిఎస్ భాగస్వామ్యంతో వ్యర్థాలను ఉపయోగించే కొత్త ఉత్పత్తులను తయారు చేయడానికి అవలంబించే ఐదు పద్ధతులు అనే అంశంపై 2023లో నిర్వహించిన వ్యాసరచన పోటీలలో రెడ్డి గీతక జిల్లా స్థాయి పోటీలలో పాల్గొని, రాష్ట్ర, జాతీయస్థాయిలో విజయం సాధించి ప్రథమ స్థానంలో నిలిచిందన్నారు. ఈ మేరకు ఢిల్లీలోనే రాష్ట్రపతి భవన్లో రాష్ట్రపతి ముర్మా చేతుల మీదుగా రెడ్డి గీతిక జాతీయ ఎక్సలెన్స్ అవార్డు స్వీకరించడం అభినందనీయమన్నారు. ఈ సందర్భంగా విద్యార్థిని తల్లిదండ్రులు హరిత, రెడ్డి ప్రసాద్ మాట్లాడుతూ లిటిల్ ఏంజెల్స్ స్కూల్ యాజమాన్యం విద్యార్థులకు విద్యను అందించడంతో పాటు, వారిలోని సజనాత్మకతను వెలికి తీసి, ఇలాంటి పోటీల్లో పాల్గొనే అవార్డులు కైవసం చేసుకునేలా ప్రోత్సహించడం అభినందనీయమన్నారు. స్కూల్ ప్రధానోపాధ్యాయురాలు సర్వాణి పాల్గొన్నారు.

సిఐటియు ఆధ్వర్యంలో మున్సిపల్ కార్మికుల ర్యాలీ

మాకూ 'తల్లికి వందనం' ఇవ్వాలి

మున్సిపల్ కార్మికుల బైక్‌ర్యాలీ

ప్రజాశక్తి - వెంకటగిరి టౌన్, గూడూరు టౌన్

మున్సిపల్ పారిశుధ్య ఇంజినీరింగ్ కార్మికులకూ 'తల్లికి వందనం' ఇవ్వాలంటూ ఎపి మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ (సిఐటియు) ఆధ్వర్యంలో గురువారం బైక్‌ర్యాలీ నిర్వహించారు. వెంకటగిరి పురవీధుల్లో బైక్‌ర్యాలీ చేపట్టి, మున్సిపల్ కార్యాలయం వద్ద శిబిరం వద్దకు చేరుకున్నారు. శానిటరీ ఇన్‌స్పెక్టర్ రామారావును బదిలీ చేయాలని, పారిశుధ్య విభాగం నుంచి పక్కన పెట్టాలని డిమాండ్ చేశారు. యూనియన్ జిల్లా అధ్యక్షులు వడ్డిపల్లి చెంగయ్య మాట్లాడుతూ తల్లికి వందనం అమౌంట్ 15వేల రూపాయలను మున్సిపల్ కార్మికుల తల్లుల ఖాతాలో జమ చేయాలని డిమాండ్ చేశారు. కూటమి ప్రభుత్వం హామీ ఇచ్చి తుంగలో తొక్కిందన్నారు. జీవో నంబర్ 26 ప్రకారం పారిశుధ్య ఇంజినీరింగ్ కార్మికులకు తల్లికి వందనం వర్తింపజేయాలన్నారు. నిబంధనలకు విరుద్ధంగా పదేళ్లుగా వెంకటగిరిలోనే తిష్ట వేసుకుని విధులు నిర్వహిస్తున్న శానిటరీ ఇన్‌స్పెక్టర్ రామారావును వెంటనే బదిలీ చేయాలని, అప్పటివరకూ పారిశుధ్య విభాగం నుంచి తప్పించాలని డిమాండ్ చేశారు. రామారావును బదిలీ చేసేంత వరకూ పోరాటం ఆగదన్నారు. డైలీ వేజెస్ కార్మికులకు పెండింగ్ జీతాలు చెల్లించాలన్నారు. ఈ కార్యక్రమంలో వి.పెంచలయ్య, సుబ్బయ్య, ప్రసాద్, సుబ్రమణ్యం, పి.రమణయ్య, హరిబాబు పాల్గొన్నారు.

- గూడూరు టౌన్‌లో... మున్సిపల్ ఇంజినీరింగ్ పారిశుధ్య కార్మికులకు సంక్షేమ పథకాలు అమలు చేయాలని గూడూరు పట్టణ కార్యదర్శి దారా కోటేశ్వరరావు ఆధ్వర్యంలో సిఐటియు కార్యాలయం నుంచి బైక్‌ర్యాలీ నిర్వహించారు. ప్రభుత్వం స్పందించని పక్షంలో 23న కలెక్టరేట్ వద్ద ధర్నా చేయనున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో నాయకులు జోగి శివకుమార్, పామంజి మణి, బివి రమణయ్య, బి.రమేష్, జి.మణి, భూలోక పెంచల ప్రసాద్, అడపాల ప్రసాద్ పాల్గొన్నారు.

తూతూ మంత్రంగా 'జన్ సన్వాయ్'

ప్రజాశక్తి - తిరుపతి డెస్క్

రాష్ట్రీయ మహిళా ఆయోగ్ ఆప్కే ద్వార్ మహిళా జన్ సన్వాయ్ ఆధ్వర్యంలో తిరుపతి జిల్లా కార్యాలయంలో గురువారం ఉదయం నుంచి జరిగిన రాష్ట్రస్థాయి మహిళా సమస్యల పరిష్కార వేదిక తూతూ మంత్రంగా సాగింది. నేషనల్ కమిషన్ ఫర్ వుమెన్ గౌరవ సభ్యులు డాక్టర్ అర్చన మజుందర్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ వెంకటేశ్వర్, ఎస్పీ హర్షవర్ధన్ రాజు తదితర ఉన్నతాధికారుల సమక్షంలో వివిధ రంగాలలో మహిళలు ఎదుర్కొంటున్న సమస్యలపై నేరుగా ఆయా శాఖల సమక్షంలో విచారించే కార్యక్రమం అసంతప్తిగా జరిగింది. ప్రతి సమస్యకూ పరిష్కారం చూపకపోగా తిరిగి కొత్తగా ఫిర్యాదు చేయాలనే సమాధానమే కనిపించింది. మహిళలు మానసికంగా ఎదుర్కొంటున్న అనేక సమస్యలను తమ పరిధికి రావని సుతి మెత్తగా చెప్పి పంపేయడంతో సుదూర ప్రాంతాల నుంచి వచ్చిన మహిళలు అసంతప్తికి లోనయ్యారు. మహిళలు చెప్పే సమస్యను పూర్తిగా వినకుండా, తమకు ఏం కావాలో డైరెక్టుగా చెప్పమని అడగడంతో ఏం చెప్పాలో దిక్కుతోచక మహిళలు సతమతమయ్యారు. పోలీసులు మహిళలను వేధిస్తున్న సమస్యలే అధికంగా వచ్చాయి. వీటి పరిష్కారానికి మళ్లీ పోలీసులనే కలవమని చెప్పడం హాస్యాస్పదంగా కనిపించింది. అధిక సంఖ్యలో వయోవద్ధులు చిన్నపిల్లలతో మహిళలు హాజరై మధ్యాహ్నం భోజనం లేకుండా నిరీక్షించినప్పటికీ సమస్యలు అపరిష్కతంగా మిగిలిపోవడంతో అనేకమంది మహిళలు అసంతప్తి వ్యక్తం చేశారు. నేషనల్ మహిళా కమిషన్ సభ్యులు ప్రతి సమస్యకు దాటవేత ధోరణితో వ్యవహరించడంతో మహిళలు తీవ్రంగా బాధపడుతూ ఇక్కడికి ఎందుకు వచ్చామా అంటూ గుసగుసలాడుతూ తిరిగి వెళ్ళడం కనిపించింది. నేషనల్ కమిషన్ ఫర్ విమెన్ సభ్యులు సమక్షంలో తమ సమస్యలు పరిష్కరించబడతాయని ఆశతో వచ్చిన మహిళలు నిరాశతో వెనుదిరిగారు.

మహిళలపై అఘాయిత్యాలను నివారించాలి

జాతీయ మహిళా కమిషన్‌కు ఐద్వా ఫిర్యాదు

ప్రజాశక్తి - తిరుపతి టౌన్

మహిళా జాతీయ కమిషన్‌కు ఫిర్యాదు చేస్తున్న సాయిలక్ష్మి

మహిళలపై ఇటీవల కాలంలో అఘాయిత్యాలు పెరిగిపోయాయని, వాటిని నివారించాలని జాతీయ మహిళా కమిషన్ సభ్యురాలు డాక్టర్ అర్చనా మంజుందార్‌కు ఐద్వా జిల్లా కార్యదర్శి డాక్టర్ పి.సాయిలక్ష్మి ఫిర్యాదు చేశారు. జిల్లాలో ఇటీవల జరిగిన మహిళా సమస్యలు, పోలీసులు స్పందించిన తీరుపై ఆమె వినతిపత్రంలో పేర్కొన్నారు. భూ విక్రయాల్లో మధ్యవర్తిగా వ్యవహరించిన హేమలతను తిరుచానూరు పోలీసులు తీసుకెళ్లి సిఐ సమక్షంలో ఎస్ఐ, కానిస్టేబుళ్లు చితకబాదిన ఘటనను వివరించారు. అలాగే తిరుపతి రూరల్ మండలం బిటిఆర్ అంబేద్కర్ కానీకి సంబంధించిన ఆటో కార్మికురాలు భాగ్యశ్రీని మద్దిస్తం పేరుతో తీసుకెళ్లి ధనశేఖర్ బంధువులు ఆమెపై దాడిచేసి నడుము విరగ్గొట్టారన్నారు. అయితే ప్రధాన నిందితుల పేర్లను ఎఫ్ఐఆర్‌లో చేర్చకుండా వదిలేశారన్నారు. ఆ పేర్లను ఎఫ్ఐఆర్‌లో చేర్చాలని కోరారు. బాధితులకు ఆర్థిక సాయం చేయాలని పేర్కొన్నారు. జాతీయ మహిళా కమిషన్ సభ్యులు స్పందిస్తూ రెండు వారాల్లోనే విచారించి తమకు నివేదిక పంపించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో బాధిత మహిళలు హేమలత, భాగ్యశ్రీ, వీణ పాల్గొన్నారు.

జగన్ అసత్య ఆరోపణలు మానుకో : కోడూరు బాల సుబ్రహ్మణ్యం

ప్రజాశక్తి - తిరుపతి సిటీ : గురువారం మాజీ సీఎం జగన్మోహన్ రెడ్డి విలేకరుల సమావేశంలో చేసిన అసత్య ఆరోపణలు, దుష్ప్రచారాలను డాక్టర్ కోడూరు బాల సుబ్రహ్మణ్యం ఖండించారు. తాను ఎలాంటి బెదిరింపులకు భయపడే వాడిని కాదని, ప్రజాస్వామ్యాన్ని దాటి ఏ ఒక్క అడుగు కూడా వేయనని స్పష్టం చేశారు. తాను నారా లోకేష్ ఆత్మాహుతి బృంద సభ్యుడినని, ఇది లోకేష్, చంద్రబాబు నాయుడుల నాయకత్వానికి నేను ఇచ్చిన నిబద్ధత అని పేర్కొన్నారు. జగన్ రెడ్డి మున్సిపల్ ఉప ఎన్నికలపై చేసినవి అసత్య ఆరోపణలని స్పష్టం చేశారు. జగన్ ప్రజాస్వామ్యంపై మాట్లాడటమే విడ్డూరమని, రాజరెడ్డి రాజ్యంగా పాలించి ఇప్పుడు నైతికత మీద ఉపదేశాలు ఇవ్వడం ఎందుకని ప్రశ్నించారు.

ఎస్.కే.ఆర్ అధ్యాపకురాలికి ఘన సన్మానం

ప్రజాశక్తి - గూడూరు టౌన్ : స్థానిక ఎస్ కే ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో వాణిజశాస్త్ర విభాగంలో అధ్యాపకురాలుగా పనిచేస్తున్న ఎం.వి.ఎల్ శైలజ జిల్లాలోని చేతి వృత్తులపై ఆర్థిక అంశాలు- ప్రభావం అనే అంశంపై పరిశోధన చేసి తన సిద్ధాంతాన్ని విక్రమ సింహపురి యూనివర్సిటీకి సమర్పించినందుకు ఇటీవల డాక్టరేట్ అందుకున్నారు. ఈ సందర్భంగా ఎస్ కే ఆర్ ప్రభుత్వ కళాశాల అధ్యాపక అధ్యాపకేతర సిబ్బంది ఆమెను ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ కే. శివప్రసాద్, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ వై.శ్రీనివాసులు ఇతర అధ్యాపక అధ్యాపక, సిబ్బంది పాల్గొన్నారు.

శ్రీసిటీకి సీఎఫ్ఓ పురస్కారం

ప్రజాశక్తి - సత్యవేడు: ఈ నెల 18న ముంబైలోని జియో వరల్డ్ కన్వెన్షన్ సెంటర్‌లో జరిగిన 8వ వార్షిక బిజినెస్ వరల్డ్ సిఎఫ్ఓ వరల్డ్ ఫైనాన్స్ స్ట్రాటజీ ఎక్సలెన్స్ అవార్డులలో శ్రీసిటీ చీఫ్ ఫైనాన్షియల్ ఆఫీసర్ ఆర్.నాగరాజన్ ప్రతిష్టాత్మక 'బెస్ట్ సిఎఫ్ఓ ఇన్ స్మాల్ ఎంటర్‌ప్రైజ్' అవార్డును అందుకున్నారు. ఉత్తమ ఆర్థిక ప్రణాళిక, పనితీరుకుగాను ఆయనకు అవార్డు దక్కింది.

వైసీపీ నుంచి కాంగ్రెస్‌లోకి కార్తికేయన్

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ : మునిసిపాలిటీ మాజీ కౌన్సిలర్ సికే కార్తికేయన్ ఏపీసీసీ అధ్యక్షురాలు వై ఎస్. షర్మిల రెడ్డి సమక్షంలో వైసీపీ నుంచి కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ కార్యక్రమానికి జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు పోటుగారి భాస్కర్ ఆధ్వర్యం వహించారు. ఈ సందర్భంగా కార్తికేయన్ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలను ఎండగట్టాలంటే షర్మిల రెడ్డి మాత్రమే సరైన నాయకురాలన్నారు. తాను 2005లో పుత్తూరు మునిసిపల్ కాన్సిలర్‌గా సేవలందించానని, ప్రస్తుతం తన సతీమణి వనిత కార్తికేయన్ కూడా పుత్తూరు మునిసిపల్ 16వ వార్డు కౌన్సిలర్‌గా సేవలందిస్తున్నారని తెలిపారు.

ఆయిల్ ఫామ్ సాగుపై అవగాహన

ప్రజాశక్తి-కోట: జిల్లా ఉద్యానవన శాఖ ఆధ్వర్యంలో ఆయిల్ ఫామ్ పంట సాగుపై రైతులు అవగాహన కలిగి ఉండాలని ఉద్యాన వనరుల అధికారిణి సునీత సూచించారు. ఈ సందర్భంగా గురువారం ఆమె మాట్లాడుతూ మాట్లాడుతూ ఆయిల్ ఫామ్‌ను వంటనూనెల్లో ఎక్కువ వినియోగించుకుంటున్నారని, కావున రైతులు ఈ పంట సాగుపై అవగాహన పెంచుకుని ఎక్కువ దిగుబడి వచ్చే విధంగా సాగు చేయాలరన్నారు. అనంతరం రైతులకు పంట సాగుపై పలు సూచనలు చేశారు. గూడూరు, చిల్లకూరు, కోట, వాకాడు మండలాల్లో ఆయిల్ ఫామ్ సాగుపై రైతులందరూ అవగాహన కలిగి ఉండాలన్నారు.

నేడు ఎమ్మెల్యే జన్మదిన సంబరాలు

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ : నగిరి నియోజకవర్గం శాసనసభ్యులు గాలి భాను ప్రకాష్ జన్మదిన సంబరాలు శుక్రవారం పుత్తూరు, అన్న క్యాంటీన్ సమీపంలోని మాజీ మంత్రివర్యులు గాలి ముదు కృష్ణమ నాయుడు విగ్రహం వద్ద ఘనంగా నిర్వహించనున్నారు. పట్టణ పార్టీ అధ్యక్షుడు గాలి జీవరత్నం నాయుడు, ప్రధాన కార్యదర్శి ఎన్ఎన్ ధనపాల్, రూరల్ పార్టీ అధ్యక్షులు బాలాజీ, ప్రధాన కార్యదర్శి వెంకటేష్‌లు ఈ విషయం గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జన్మదిన వేడుకల్లో పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొనాలని కోరారు.

నేడు రక్తదాన శిబిరం

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): సీఎం చంద్రబాబు నాయుడు సతీమణి నారా భువనేశ్వరి జన్మదినం పురస్కరించుకుని కొప్పర్ల లక్ష్మి చారిటబుల్ ఫౌండేషన్ తిరుమల, ఎన్టీఆర్ ట్రస్ట్ సౌజన్యంతో కచ్చపి ఆడిటోరియంలో శుక్రవారం రక్తదాన శిబిరం నిర్వహించనున్నట్లు కొప్పర్ల లక్ష్మి చారిటబుల్ ఫౌండేషన్ తిరుమల ఎండి కొప్పర్ల దివాకర్ తెలిపారు. గురువారం తిరుపతి ప్రెస్ క్లబ్‌లో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రక్తదాన శిబిరంలో యువత పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని, ఈ రక్తదాన శిబిర కార్యక్రమంలో టిడిపి శ్రేణులు పాల్గొంటాయన్నారు. ఈ విలేకరుల సమావేశంలో రమేష్ తదితరులు పాల్గొన్నారు.

టిడిపి నాయకుడికి పరామర్శ

ప్రజాశక్తి -ఏర్పేడు : ఏర్పేడు మండలంలో టిడిపి సీనియర్ నాయకుడిని శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బొజ్జల వెంకట సుధీర్ రెడ్డి దంపతులు పరామర్శించారు. కందాడకు చెందిన టిడిపి సీనియర్ నాయకులు అశ్వద్ధామ ఇటీవల అనారోగ్యంతో చికిత్స పొంది విశ్రాంతి తీసుకుంటుండగా ఎమ్మెల్యే బొజ్జల సుధీర్ రెడ్డి దంపతులు పరామర్శించారు.

రెడ్‌బుక్ రాజ్యాంగం వద్దు

ప్రజాశక్తి - రామచంద్రపురం (చంద్రగిరి) ఏపీలో రెడ్ బుక్ రాజ్యాంగం నడుస్తోందని.. అంభేద్కర్ రాజ్యాంగం అమలు కావడం లేదని చంద్రగిరిలో వైఎస్ఆర్‌సిపి నేతలు కార్యకర్తలు రోడ్డెక్కారు. గురువారం చంద్రగిరి మాజీ ఎమ్మెల్యే, వైఎస్ఆర్‌సిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి అరెస్టును వ్యతిరేకిస్తూ పెద్ద నినాదాలు చేశారు. ఈ సందర్భంగా పార్టీ నేతలు మాట్లాడుతూ చెవిరెడ్డి అరెస్టు కక్ష సాధింపు చర్య అన్నారు. ఈ నిరసన కార్యక్రమంలో వైసీపీ నేతలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

సంస్థాగత ఎన్నికలు ఏకగ్రీవం

ప్రజాశక్తి - చిట్టమూరు: గురువారం జరిగిన టిడిపి మండల సంస్థాగత ఎన్నికల్లో వాకాడు మండల టీడీపీ మండల అధ్యక్షుడుగా దువ్వూరు మధుసూదన్ రెడ్డి, మండల కార్యదర్శిగా దోసకాయల కృష్ణమూర్తి, గూడూరు నియోజకవర్గ ఎన్నికల పరిశీలకులు ఈశ్వరవాక శివకోట రెడ్డి సమక్షంలో ఏకగ్రీవంగా ఎన్నిక అయ్యారు. ఈ సందర్భంగా మండల అధ్యక్షులు దువ్వూరు మధుసూదన్ రెడ్డి మాట్లాడుతూ, మండల అధ్యక్షుడుగా ఎన్నుకున్న జిల్లా, మండల టీడీపీ నాయకులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. మండల అభివృద్ధికి పార్టీ బలోపేతానికి కృషి చేస్తానని వాగ్దానం చేశారు. ఈ కార్యక్రమంలో సన్నారెడ్డి విజయ్ శేఖర్ రెడ్డి, ప్రసాద్ రెడ్డి, హరీష్ నాయుడు తదితరులు పాల్గొన్నారు.

రేపు శ్రీరామ్ ఆటో ఫైనాన్స్ కార్యాలయం ముట్టడి

ప్రజాశక్తి - తిరుపతి సిటీ : తిరుపతి, శ్రీరామ్ ఫైనాన్స్ ఆగడాలపై కార్మిక వర్గానికి అండగా ఈ నెల 21న సిపిఐ ఆధ్వర్యంలో ముట్టడి కార్యక్రమం నిర్వహిస్తున్నామని సిపిఐ జిల్లా కార్యదర్శి మురళి తెలిపారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ తిరుపతి హెడ్ క్వార్టర్స్‌లో ఉన్న శ్రీరామ్ ఆటో ఫైనాన్స్‌లో పని చేస్తున్న జీఎం సుధాకర్ రెడ్డి చిత్తూరు, అన్నమయ్య, తిరుపతి జిల్లాలకు ఇన్చార్జిగా ఉంటూ, ఆటో, టాక్సీ, టాటా ఏసీ ఇతర వాహనదారులను అధిక పెనాల్టీలో నిలువు దోపిడీ చేస్తున్నారన్నారు. కార్మిక వర్గానికి అండగా శనివారం శ్రీరామ్ ఫైనాన్స్ కార్యాలయాన్ని ముట్టడిస్తున్నట్లు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మూడు జిల్లాల డ్రైవర్లు పాల్గొని బాధితులకు అండగా నిలవాలని కోరారు.

ఈ రోడ్డుకు మోక్షమెప్పుడు..?

- భారీ వాహనాల రద్దీ
- దుమ్ము ధూళిలో పట్టణ ప్రజలు
- చినుకు పడితే రొచ్చు రొచ్చే
- గ్యాస్ పైప్‌లైన్లతో రోడ్లకు మరిన్ని తూట్లు

నిత్యం ప్రజలతో రద్దీ, అడ్డు అదుపు లేకుండా తిరుగుతున్న భారీ వాహనాలు ఎప్పుడో 20 ఏళ్ల కిందట నిర్మించిన రోడ్డు నేడు గుంతలు పడి దుమ్ము దూళితో నిండిపోయి అధ్వన్నంగా తయారైంది. ఆ రోడ్డులో ప్రయాణమంటే నరకం. తిరుపతి జిల్లా నాయుడుపేట, పిచ్చిరెడ్డి తోపు, పాత ట్రెజరీ ఆఫీసురోడ్డు దుస్థితిపై ప్రజాశక్తి ఫోకస్.

ప్రజాశక్తి - నాయుడుపేట

గ్యాస్ లైన్‌కోసం తవ్వుతున్న గుంతలు

వాహనాల రద్దీ, రేగుతున్న దుమ్ము

గుల్ల గుల్లయిన రోడ్డు

నాయుడుపేట, పిచ్చిరెడ్డి తోపు, పాత ట్రెజరీ ఆఫీసు రోడ్డుకు చుట్టుపక్కల వందలాదిగా ఇళ్లు, రోడ్డుకు పక్కనే ఎన్నో వ్యాపారాలు, స్కూలుకు వెళ్లి వచ్చే పిల్లలు, పిల్లల కోసం వచ్చే గృహిణులు ఇలా నిత్యం రద్దీగా ఉండే ఈ రోడ్డు, ఎప్పుడో 20 ఏళ్ల కిందట అంతగా వాహనాల రద్దీ లేని కాలంలో నిర్మించారు. ఆ తర్వాత నాయుడుపేట మండలం మేనకూరులో ఏర్పడ్డ సెజ్ కారణంగా ఈ రోడ్డుపై రోజు వందలాదిగా భారీ వాహనాలు తిరుగుతున్నాయి. ఈ వాహనాల కారణంగా రోడ్డు గుల్లగుల్లై పోయి చిన్న వర్షానికి కూడా బురద కాలువను తలపిస్తోంది. ఎండ వేళ వాహనాల దెబ్బకు లేస్తున్న దుమ్ముకి ఇళ్లల్లో ఉండలేని పరిస్థితి. గోరుచుట్ట మీద రోకటిపోటన్నట్టు గ్యాస్ పైప్ లైన్ పేరిట అంతంత మాత్రంగా ఉన్న ఆ రోడ్డుకు మరిన్ని తూట్లు పొడుస్తు గుంతలమయం చేస్తున్నారు. ఈ రోడ్డు పలు ప్రాంతాల నుంచి నాయుడుపేటకు వచ్చే ప్రజలకు ప్రధాన రహదారి, వెంకటగిరి వైపు వెళ్లే ఆర్టీసీ బస్సులుకు, వాహనాలకు కూడా ఇదే ప్రధాన మార్గం. అలాంటి ముఖ్యమైన మార్గం దుర్భర స్థితిలో ఉన్నా అధికారులకు గానీ, నాయకులు గాని చీమ కుట్టినట్టు కూడా లేదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దుమ్ము ధూళితోనే ఇబ్బంది పడుతుంటే, విపరీతమైన భారీ లారీల శబ్దాలు హారాన్లతో మార్మోగిపోతూ ఇబ్బంది పడుతున్నామని రోడ్డు పక్క నివాసితులు తమ గోడు ఎవరూ పట్టించుకోవడం లేదంటున్నారు. సెజ్, శ్రీసిటీ కంపెనీలకు తిరిగే బస్సులు ఒక విధానం లేకుండా తిరుగుతూ ఎక్కడ పడితే అక్కడ వెనుక ముందు కాలినడకన వస్తున్న మనుషులను, ద్విచక్ర వాహనాలను గమనించకుండా ఇష్టానుసారంగా ఆపుతున్నందున పలు ప్రమాదాలు జరుగుతున్నాయి.

ఈ రోడ్డు ఆర్ అండ్ బి శాఖకు సంబంధించినది. రోడ్డు పరిస్థితి పలుమార్లు వారి దృష్టికి తీసుకెళ్లాం. వారు నిధుల లోటు కారణంగా చేయలేకపోతున్నామని చెప్పుకొస్తున్నారు. ఆ రోడ్డు మున్సిపల్ పరిధిలో ఉన్నందున ప్రజలు ఇబ్బందులు పడకుండా గత కమిషనర్ 10 లక్షలు ఖర్చుపెట్టి రోడ్డుపై మట్టి వేసి మరమ్మత్తులు చేశారు. ఇప్పుడు కూడా మరోసారి రోడ్డు మరమ్మత్తుల కోసం 10 లక్షల రూపాయలు వెచ్చించి గుంతలు పడ్డ చోట పనులు చేసేందుకు సోమవారం జరిగిన మునిసిపల్ సమావేశంలో బిల్లు పెట్టడం జరిగింది. త్వరలోనే మరమ్మతు పనులు ప్రారంభిస్తాం.

- ఎస్.కె పజిల్లుల్లా, మున్సిపల్ కమిషనర్

గత 20 సంవత్సరాల్లో ఈ రోడ్డుపై రద్దీ చాలా పెరిగింది. మరమ్మతులు మాత్రం జరగలేదు. గతంలో తిరుపతివైపు వెళ్లే వాహనాలకు రహదారిగా ఉండేది. అనంతరం ఆర్టీసీ బస్టాండ్ నుంచి హైవే నిర్మించి భారీ వాహనాలను అటు మళ్ళించారు. కానీ మేనకూరులో సెజ్ వచ్చాక కథ మళ్లీ మొదలు. సెజ్‌కు వెళ్లే వాహనాలను కరెంట్ ఆఫీస్ సెంటర్ నుంచి స్వర్ణముఖి నది వారధిని కలిపే వేరొక దారిని పదేళ్ల ముందు కొంతవరకు నిర్మించారు. అధికారుల నిర్లక్ష్యం, భూ హక్కుదారులు కోర్టుకు వెళ్లడంతో అది నిలిచిపోయింది. ప్రజాధనం వృధా అయింది.

- సీనియర్ లాయర్, బార్ అసోసియేషన్ గౌరవ అధ్యక్షులు వెందోటి పార్థసారథి రెడ్డి

పిచ్చిరెడ్డి తోపు, పాత ట్రెజరీ మార్గాలు ఏళ్ల తరబడి ఇంత దుర్భరంగా ఉన్నప్పటికీ అధికారుల నిర్లక్ష్యం దారుణం. వాహనాల రద్దీ, గుంతల మయమైన రోడ్డు దానికి తోడు గ్యాస్ పైప్ లైన్ కోసం తీసిన గుంతలతో స్థానికులు ఏ క్షణాన ఏ ప్రమాదం జరుగుతుందోనని ఆందోళన చెందుతున్నారు.

- నాయుడుపేట సిఐటియు కార్యదర్శి శివకవి ముకుంద

ఈ సమస్యను ఎన్నోసార్లు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాం, త్వరలోనే రోడ్డు నిర్మాణం చేపట్టే అవకాశాలున్నాయి. భారీ వాహనాలను పట్టణంలో ప్రవేశించకుండా నెల్లూరు చెన్నై హైవే నుంచి నాయుడుపేట మండలం పళ్లూరు మీదుగా వెంకటగిరి వైపు హైవే నిర్మాణం చేపడుతున్నాం. గతంలో జరిగిన భూ సర్వే కొన్ని కారణాలతో ఆగిపోయింది. మళ్లీ సర్వే చేపట్టాం. హైవే నిర్మాణం త్వరలోనే పూర్తి చేస్తాం. ఇది పూర్తయితే సెజ్‌కు వెళ్లే భారీ వాహనాలు పూర్తిగా అటు మళ్ళిస్తాం.

- పరమేశ్వరి, ఆర్ అండ్ బి డిఇ

కూటమి ప్రభుత్వం పంథా మార్చుకోవాలి

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): సుపరిపాలన అందిస్తామని మాయమాటలు చెప్పి అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం వెనుకబడిన తరగతులు, ఎస్సీ, ఎస్టి, మైనారిటీ వర్గాల ప్రజలను మోసం చేస్తున్నారని, ఇకనైనా కూటమి ప్రభుత్వం తన ఫందా మార్చుకోవాలని ఆల్ ఇండియా బహుజన్ సమాజ్ పార్టీ జాతీయ కోఆర్డినేటర్ పూర్ణచంద్రరావు సూచించారు. గురువారం తిరుపతి ప్రెస్ క్లబ్‌లో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. జగన్ తన ఐదేళ్ల పరిపాలనలో రాష్ట్రంలో అరాచకాలు సృష్టించారని గడిచిన ఏడాది పాటు చెప్పుకుంటూ వచ్చారని, ఏడాది తర్వాత కూడా అదే ప్రచారాన్ని కొనసాగిస్తూ బిసి, ఎస్సీ, ఎస్టి, మైనారిటీ వర్గాల ప్రజలకు ఇచ్చిన హామీలను పక్కకు నెడుతున్నారని ఆరోపించారు. జనాభా దామాషా ప్రకారం ఎక్కడ సీట్లు కేటాయించాల్సి వస్తుందో అని పథకం ప్రకారం జనగణన పక్కన పెట్టేసారన్నారు. 54 శాతం బీసీ వర్గాలకు చెందిన వారు ఉంటే జనాభా దామాషా ప్రకారం ఎమ్మెల్యే స్థానాలు కూడా అదే స్థాయిలో ఉండాలి గాని కేవలం కుదించి తమ వర్గం వారికి సీట్ల కేటాయింపు కూడా జరిగిందన్నది అందరికీ తెలుసన్నారు. ఈ విలేకరుల సమావేశంలో ఏబిఎస్పి ఉపాధ్యక్షులు శ్రీరాములు, వెంకటస్వామి, భాస్కర్ యాదవ్, కేశవులు, మునెయ్య తదితరులు పాల్గొన్నారు.

మండల బాధ్యుల నియామకంపై తెలుగు తమ్ముళ్లు గరం గరం

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి : సంస్థాగత ఎన్నికలు జరపకుండానే శ్రీకాళహస్తి నియోజకవర్గంలో టీడీపీ పట్టణ, మండల బాధ్యులను నియమించారన్న విమర్శలు వస్తున్నాయి. నిబంధనలు పక్కన పెట్టి పార్టీ బాధ్యులను ప్రకటించడంపై తెలుగు తమ్ముళ్లు మండిపడుతున్నారు. టీడీపీ శ్రీకాళహస్తి పట్టణ బాధ్యుడు మినహా, తొట్టంబేడు, శ్రీకాళహస్తి రూరల్ మండలం, ఏర్పేడు, రేణిగుంట మండలాలకు కొత్త బాధ్యులను నియమించారు. అయితే ఇది సంస్థాగత ఎన్నికల నియమాళికి పూర్తి విరుద్ధమని తెలుగు తమ్ముళ్లు పెదవి విరుస్తున్నారు. సామాజికవర్గం, బలాలు, ఓట్ల ప్రాతిపదికన బాధ్యుల నియామకం జరిగి ఉంటే తమకే అవకాశం దక్కేదని పలువురు ఆశావహుల మాట. అయితే పట్టణ, మండల బాధ్యులను హడావిడిగా ప్రకటించేసి, సామాజిక మాధ్యమాలు, పత్రికల్లో హల్ చల్ చేసేయడంతో టీడీపీ వర్గాల్లో గందరగోళ పరిస్థితులు నెలకొన్నాయి.

పీలేరు పరిశీలకులుగా దశరథాచారి .. పీలేరు నియోజకవర్గ టిడిపి సంస్థాగత ఎన్నికల పరిస్థితులుగా శ్రీకాళహస్తి ప్రాంతానికి చెందిన టిడిపి సీనియర్ నేత, ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి గుమ్మడిపూడి దశరథాచారిని టిడిపి అధిష్టానం నియమించింది. ఆ మేరకు ఆయన గురువారం పీలేరు నియోజకవర్గ ఎమ్మెల్యే నల్లారి కిషోర్ కుమార్ రెడ్డితో సమావేశమయ్యారు. సంస్థాగత ఎన్నికల నిర్వహణపై చర్చించారు.

తల్లికి వందనం పథకం తేదీని పొడిగించాలి

ప్రజాశక్తి - నాయుడుపేట: నాయుడుపేట, ఆవాజ్ పట్టణ కమిటీ ఆధ్వర్యంలో అవాజ్ కమిటీ సభ్యులు తల్లికి వందనం పథకానికి అనర్హత వేటుపడ్డ పేద వాళ్లకు న్యాయం చేయాలని, నాయుడుపేట మున్సిపల్ కమిషనర్ ఎస్.కె ఫజులుల్లాకు గురువారం అర్జీ సమర్పించారు. ఈ సందర్భంగా ఆవాజ్ కమిటీ నాయకులు పి.హలీంమ్ ఖాన్ మాట్లాడుతూ మండలంలో నిరుపేదలు తల్లికి వందనం ద్వారా లభించే సాయంతో తమ పిల్లలను పాఠశాలల్లో చేర్చడానికి ఎదురుచూస్తున్నారన్నారు. ఈ తరుణంలో ప్రభుత్వం తల్లికి వందనం అర్హులైన వారిని గత ప్రభుత్వంలోని కొన్ని అవకతవకల వల్ల చాలామంది నిరుపేదలు అనార్హుల వేటు పడటంతో వారు సచివాలయాలు వద్ద బారులు తీరుతున్నారని తెలిపారు. సచివాలయ సిబ్బందికి సకాలంలో వీరి జాబితా అందించే సమయం లేకపోవడంతో వారికి పథకం చేరలేదన్నారు. అందువల్ల ప్రభుత్వం గడువును పొడిగించవలసిందిగా కోరారు. ఈ కార్యక్రమంలో ఆవాజ్ కమిటీ సభ్యులు ఎస్కె ఖాదర్ భాయ్, ఎస్కె అబ్దుల్లా, ఉస్మాన్ అబ్దుల్, గని బాయ్ తదితరులు పాల్గొన్నారు.

జగన్ చేస్తోంది పరామర్శలా... బలప్రదర్శనలా?

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం) మాజీ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ఉనికిని కోల్పోయిన వైయస్సార్ కాంగ్రెస్ పార్టీని ప్రజలు మళ్ళీ గుర్తుపెట్టుకోవాలని ఏడాది క్రితం చనిపోయిన వ్యక్తి ఇంటికి వెళ్లి పరామర్శల పేరుతో బల ప్రదర్శనలు చేస్తున్నారని నగరపాలక సంస్థ డిప్యూటీ మేయర్ ఆర్.సి మునికష్ణ ఆరోపించారు. గురువారం తిరుపతి ప్రెస్ క్లబ్ లో విలేకరుల సమావేశంలో టిడిపి తిరుపతి పార్లమెంటు అధికార ప్రతినిధి ఊట్ల సురేంద్ర నాయుడుతో కలసి మాట్లాడారు. వైసిపి అధికారంలో ఉన్న ఐదేళ్లు రాష్ట్రం పూర్తిగా అభివద్ధిలో వెనక్కు వెళ్లిపోయిందని, మళ్లీ రాష్ట్రాన్ని అభివద్ధి బాటలో నడిపించడానికి ఏడాదికాలంగా కూటమి ప్రభుత్వం అహర్నిశలు శ్రమించాల్సి వస్తోందన్నారు. జగన్ పరామర్శలకు వెళుతూ పరిమితికి మించి వాహనాలు వినియోగిస్తూ కొంతమంది చనిపోవడానికి, గాయాల పాలు కావడానికి ప్రత్యక్షంగా పరోక్షంగా కారణం అవుతున్నారన్నారు.

ప్రజల ఆస్తులు అమ్మాలని చూస్తే ఒప్పుకోం

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం) తిరుపతి ప్రజల ఆస్తులను అమ్మాలని చూస్తే వైసీపీ ప్రజల పక్షాన నిలబడి పోరాడతామని ఉమ్మడి చిత్తూరు జిల్లా వైసీపీ అధికార ప్రతినిధులు వాసు, పసుపులేటి సురేష్‌లు స్పష్టం చేశారు. గురువారం తిరుపతి ప్రెస్ క్లబ్‌లో విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. తిరుపతి నగరపాలక సంస్థ పరిధిలోని చాళుక్య భవనం తిరుపతి నగర ప్రజల ఆస్తి అని, దానిని కారు చౌకగా కొట్టేయడానికి కూటమి నేతలు చేసిన కుట్రను, బుధవారం జరిగిన కౌన్సిల్ సమావేశంలో వైసీపీకి చెందిన కార్పొరేటర్లు గట్టిగా పోరాడి ప్రజల ఆస్తిని నిలువరించారని అభినందించారు. అయితే స్థానిక ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు కమిటీ వేయడం వెనుక ఆంతర్యం ఏమిటో అర్థం కావడం లేదన్నారు. ఈ విలేకరుల సమావేశంలో వైసిపి నాయకులు ఇమ్రాన్, మల్లం రవికుమార్ రెడ్డి, కిరణ్ రాయల్ పాల్గొన్నారు.

విప్ ధిక్కరించిన వారిపై చర్యలు తీసుకోవాలి

ప్రజాశక్తి - తిరుపతి టౌన్ : బుధవారం జరిగిన కౌన్సిల్ సమావేశంలో వైసిపి తరపున గెలిచి విప్ ధిక్కరించి, మున్సిపల్ కార్పొరేషన్ స్థలం అమ్మకం విషయమై మద్దతు తెలిపిన కార్పొరేటర్లను సస్పెండ్ చేయాలని మేయర్ డాక్టర్ శిరీక్ష ఆధ్వర్యంలో వైసిపి కార్పొరేటర్లు కమిషనర్ ఎన్.మౌర్యకు వినతిపత్రం సమర్పించారు. ఈ కార్యక్రమంలో వైఎస్ఆర్సిపి కార్పొరేటర్లు సంధ్యారెడ్డి, అమర్నాథ్ రెడ్డి, వెంకటేశ్వర్లు, పునీతమ్మ, తాజిన్, రాధారెడ్డి, అనిల్ కుమార్ తదితరులు ఉన్నారు.

విద్యార్థి మిత్ర కిట్లు పంపిణీ

ప్రజాశక్తి - తొట్టంబేడు : మండలంలోని కాసారం పంచాయతీ ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు గురువారం సర్వేపల్లి రాధాకృష్ణ విద్యార్థి మిత్ర కిట్ల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా టీడీపీ నాయకులు యూనిట్ ఇన్చార్జ్ చింతపట్ల భాస్కర్ నాయుడు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బొజ్జల వెంకట సుధీర్ రెడ్డి ఆదేశాల మేరకు విద్యార్థి మిత్ర కిట్ల పంపిణీ కార్యక్రమం చేపట్టినట్లు తెలిపారు.

ప్రజాశక్తి - రామచంద్రపురం: సమాజ హితమే లక్ష్యంగా ప్రతి ఒక్కరూ సేవా కార్యక్రమాలు చేపట్టాలని టీడీడీ పాలక మండలి సభ్యులు భాను ప్రకాష్ రెడ్డి సూచించారు. గురువారం మండలంలోని కట్టకింద వెంకటాపురం, మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు మన సంస్కృతి సేవ ట్రస్ట్ ద్వారా ఆధ్వర్యంలో విద్యాసామాగ్రిని పంపిణీ చేశారు.

రాష్ట్ర స్థాయి పోటీలకు బ్యాట్మెంటన్ క్రీడాకారులు

ప్రజాశక్తి - తిరుపతి టౌన్: చిత్తూరు జిల్లా బ్యాట్మెంటన్ అసోసియేషన్ ఆధ్వర్యంలో అండర్ - 11, అండర్ - 13, అండర్ - 19 సింగిల్స్ - డబుల్ బాలికల, బాలుర జట్ల ఎంపిక జరిగింది. తిరుపతిలోని శ్రీనివాస స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో జరిగిన సెలక్షన్‌లో చిత్తూరు జిల్లా నుంచి 200 మంది క్రీడాకారులు పాల్గొన్నారని అసోసియేషన్ కార్యదర్శి పి.రామకృష్ణ, అధ్యక్షుడు కే.సత్యనారాయణ, సంయుక్త కార్యదర్శి సి.హెచ్.కిరణ్ కుమార్, కోశాధికారి జి.శివయ్య తెలియజేశారు. ఈ పోటీలలో అండర్ - 11 సింగిల్స్ విభాగంలో విన్నర్ గా దేవాన్ష్, రన్నర్‌గా షాహిద్, బాలికల విభాగంలో విన్నర్‌గా మధులిక, రన్నర్‌గా రోహిత, అండర్ -13 సింగిల్స్ బాలురు విభాగంలో విన్నర్‌గా మోత్వీక్, రన్నర్‌గా లిఖిత్ కృష్ణ, బాలికల విభాగంలో విన్నర్‌గా ఆర్.ఎం. చౌదరి, రన్నర్ గా మనస్విఅండర్ -19 బాలుర విభాగంలో విన్నర్ గా ప్రశాంత్, రన్నర్ గా ధీరజ్, బాలికల విభాగంలో విన్నర్ గా జీవిత, రన్నర్ గా లేస్విక నిలిచారు.డబుల్ విభాగంలో అండర్ - 11 బాలుర విభాగంలో విన్నర్స్ గా దేవాన్ష్- షాహిద్, రన్నర్స్ గా చరణ్ - బద్రి, బాలికల విభాగంలో విన్నర్స్ గా మధులిక - ఉపాజ్ఞ, రన్నర్స్‌గా చరిత - మోక్షిత, అండర్ 13 బాలుర విభాగంలో విన్నర్స్ గా దేవాన్ - షాహిద్, రన్నర్స్‌గా వి.కార్తీక్ - మోహిత్ రెడ్డి, బాలికల విభాగంలో విన్నర్స్ గా మధులిక - మనస్వి, రన్నర్స్ గా వి గిహిక - బి పూజితఅండర్ 19 బాలుర విభాగంతో డి. ధీరజ్ - జీ-మిథున్ విన్నర్స్ గాను రన్నర్స్ గా ఏ.పూర్ణ - జస్వంత్ తేజ నిలిచారని వారు తెలియజేశారు.ఆగస్టులో రాష్ట్రస్థాయి సెలక్షన్స్‌కు వీరు ఎంపికయ్యారని అండర్ 19 సెలెక్షన్లు విశాఖలో, అండర్ 11 సెలెక్షన్లు కడపలో, 13 సెలెక్షన్లు గుంటూరులో జరుగుతాయని వారు తెలియజేశారు. ఎంతో ఉత్సాహపూరిత వాతావరణంలో బ్యాట్మెంటన్ జిల్లా సెలక్షన్స్ జరిగాయని ఇందుకు సహకరించిన అందరికీ కృతజ్ఞతలు తెలియజేశారు.

మాలల హక్కుల కోసం యుద్ధానికి సిద్ధం

ప్రజాశక్తి - తిరుపతి సిటీ: రెండు తెలుగు రాష్ట్రాల్లో మాలల సంక్షేమం, అభివృద్ధి, హక్కుల సాధన కోసం ఎంతటి యుద్ధానికయినా సిద్ధంగా ఉన్నానని తెలంగాణ కార్మిక గనుల శాఖ మంత్రి వివేక్ స్పష్టం చేశారు. శ్రీవారి దర్శనార్థం తిరుపతికి వచ్చిన ఆయన స్థానిక ఎస్వి నగర్ లోని మాజీ మంత్రి పరసారత్నం నివాసంలో గురువారం మధ్యాహ్నం విందు స్వీకరించారు. ఈ సందర్భంగా వివిధ దళిత సంఘాల నాయకులు, బీసీ సంఘాల నాయకులు మంత్రిని సత్కరించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ మాలలపై జరుగుతున్న తప్పుడు ప్రచారాన్ని తిప్పికొట్టేందుకు తెలంగాణలో భారీ బహిరంగ సభ నిర్వహించడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్వి యూనివర్సిటీ మాజీ పాలకమండలి సభ్యులు మల్లారపు మధు, రిపబ్లికేన్ పార్టీ ఆఫ్ ఇండియా జాతీయ ప్రధానకార్యదర్శి అంజయ్య, ఆంధ్రప్రదేశ్ మాలల గెజిటెడ్ ఆఫీసర్ల సంఘం పబ్లిసిటీ సెక్రటరీ శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

హాథీరాం బావాజీ 596 జయంతిని విజయవంతం చేద్దాం

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం) శ్రీ స్వామి హాథీరాం బావాజీ 596 జయంతిని ఈనెల 29, 30వ తేదీలలో తిరుమల, తిరుపతిలోని మఠంలో ఘనంగా నిర్వహించనున్నామని, ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని బంజారా కుటుంబ సభ్యులకు శ్రీ స్వామి హథీరాం బావాజీ పరిరక్షణ కమిటీ ప్రధాన కార్యదర్శి శివ నాయక్ పిలుపునిచ్చారు. గురువారం తిరుపతి ప్రెస్ క్లబ్ లో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కోట్లాదిమంది వచ్చే తిరుమలలో శ్రీ స్వామి హాథీరాం బాబాజీ కి సంబంధించిన మఠంలో సౌకర్యాలు లేని కారణంగా బంజారా భక్తులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, ఇకనైనా అధికారులు మేల్కొని భక్తులకు అవసరమైన సౌకర్యాలను మెరుగుపరచాలని కోరారు.

21న 'యోగాంధ్ర'ను విజయవంతం చేద్దాం

ప్రజాశక్తి -తిరుపతి టౌన్ : అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని ఈనెల 21న తిరుపతి తారకరామ స్టేడియంలో నిర్వహిస్తున్న యోగాంధ్ర కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని నగరపాలక సంస్థ కమిషనర్ ఎన్.మౌర్య పిలుపునిచ్చారు. గురువారం తారకరామ స్టేడియంలో జరుగుతున్న పనులను అధికారులతో కమిషనర్ పరిశీలించారు.

క్రైం న్యూస్

మహిళ హత్య.. నగలు దోపిడీ

హత్యకు గురైన కల్పన (ఫైల్ ఫోటో)

ప్రజాశక్తి - పిచ్చాటూరు : తిరుపతి జిల్లా, పిచ్చాటూరు మండలం, అడవికోడియం బేడులో ఒంటరి మహిళను గుర్తు తెలియని దుండగులు హతమార్చినట్లు స్థానికులు తెలిపారు. స్థానికుల కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి అడవికోడియంబేడు గ్రామానికి చెందిన కల్పన (40) ఒంటరిగా ఉండడాన్ని గమనించిన దుండగులు బుధవారం రాత్రి ఆమెను గొంతు కోసి హత్య చేసి, ఆమె మెడలో ఉన్న బంగారు చైను, గొలుసులు దోచుకెళ్లినట్లు తెలిపారు. సమాచారం అందుకున్న ఎస్ఐ వెంకటేశ్వర్లు సంఘటన స్థలానికి చేరుకొని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. మృత దేహాన్ని పంచనామా నిమిత్తం సత్యవేడు ఏరియా హాస్పిటల్‌కు తరలిస్తున్నట్లు తెలిపారు.

గంజాయి కేసులో నిందితుడి అరెస్ట్

గోకుల్ అరెస్ట్ చూపుతున్న పోలీసులు

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి : గంజాయి అక్రమ రవాణా కేసులో నిందితుడిని గురువారం అరెస్టు చేసినట్లు టూ టౌన్ సీఐ నాగార్జునరెడ్డి తెలిపారు. ఒడిశా నుంచి తమిళనాడుకు శ్రీకాళహస్తి మీదుగా అక్రమంగా గంజాయి రవాణా చేస్తున్న నలుగురు అంతరాష్ట్ర ముఠా సభ్యుల్లో ముగ్గురు పోలీసులకు గత నెలలో పట్టుబడుగా, మరో నిందితుడు పరారైన విషయం విదితమే. పట్టుబడ్డ నిందితులిచ్చిన సమాచారంతో పోలీసులు పరారైన వ్యక్తిని తమిళనాడుకు చెందిన గోకుల్ (51)ను ఏ4 గా చేర్చి కేసు నమోదు చేశారు. తమిళనాడులో పలు కేసుల్లో నిందితుడైన గోకుల్‌పై ప్రత్యేక నిఘా పెట్టిన అక్కడి పోలీసులు నిందితుడ్ని అరెస్టు చేసి చెన్నై సెంట్రల్ జైలుకు తరలించారు. అక్కడి పోలీసులు ఇచ్చిన సమాచారంతో నిందితుడ్ని పీటీ వారంట్‌పై అరెస్టు చేసి శ్రీకాళహస్తి న్యాయస్థానంలో హాజరు పరిచినట్లు సీఐ తెలిపారు.

అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతి

మృతి చెందిన ధర్మ

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ : తిరుపతి నుండి తన స్నేహితులతో పుత్తూరు మండలం గోపాలకృష్ణపురం పంచాయతీ మూలకోనకు బుధవారం విహారయాత్రకి వచ్చిన ధర్మ(38) అను వ్యక్తి స్నేహితులతో సరదాగా గడిపారు. అతను స్నేహితులతో కడుపునొప్పిగా ఉందని తెలుపగా, వారు పుత్తూరుకెళ్ళి మందులు తీసుకుని వచ్చేసరికి మృతి చెందాడు. వెంటనే దగ్గరలోని ఫారెస్ట్ అధికారులకు స్నేహితులు తెలుపగా, వారు పరిశీలించి పోలీసులకు సమాచారం అందించారు.ఆసుపత్రికి తరలించగా మృతి చెందినట్లు వైద్యులు ధృవీకరించారు. పంచనామా అనంతరం బంధువులకు మృతదేహాన్ని అప్పగించారు. ఇతనికి భార్య, కుమార్తె ఉన్నారు. కానీ వారు ప్రస్తుతం విడిగా ఉంటుండగా ఇతను తన తల్లితో కలిసి తిరుపతిలో ఉంటున్నాడని సమాచారం. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు.

గుండెపోటుతో భవన నిర్మాణ కార్మికుడు మృతి

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి : గుండెపోటుతో భవన నిర్మాణ కార్మికుడు మృతి చెందిన ఘటన పట్టణంలోని బీపీ అగ్రహారంలో గురువారం చోటు చేసుకుంది. స్థానికుల కథనం మేరకు తొట్టంబేడు మండలం చియ్యవరం గ్రామానికి చెందిన ఆదెయ్య (53) భవన నిర్మాణ కార్మికుడిగా పనిచేస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్నారు. ఈ నేపథ్యంలో శ్రీకాళహస్తి పట్టణంలోని బీపీ అగ్రహారంలో ఓ ఇంటి వద్ద పనిచేసేందుకు వచ్చారు. మజ్జిగ తాగి విశ్రాంతి తీసుకుంటున్న సమయంలో హఠాత్తుగా ఛాతి నొప్పితో విలవిలాడుతూ కుప్పకూలాడు. తోటి కూలీలు పట్టణంలోని ఓ ప్రయివేట్ ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించడంతో ఆదెయ్య మృతదేహాన్ని స్వగ్రామానికి తరలించారు. మృతునికి భార్య, కుమారుడు ఉన్నారు. కుటుంబ పెద్ద మరణించడంతో ఆ ఇంట విషాదం నెలకొంది.

గంజాయి స్వాధీనం.. నలుగురి అరెస్ట్

ప్రజాశక్తి - రేణిగుంట: రేణిగుంట రైల్వే స్టేషన్‌లో, టాక్సి స్టాండ్ వద్ద మూడు కేజీల గంజాయిని ఒడిస్సా నుండి కర్ణాటకు తరలిస్తున్న నలుగురు వ్యక్తులను అదుపులో తీసుకున్నట్టు రేణిగుంట సీఐ జైచంద్ర ఒక ప్రకటనలో తెలిపారు. ఆయన మాట్లాడుతూ తమకు వచ్చిన సమాచారం మేరకు రేణిగుంట ఎస్డిపిఓ శ్రీనివాసరావు, సీఐ జయచంద్ర సిబ్బందితో కలిసి రేణిగుంట రైల్వే స్టేషన్, కార్ పార్కింగ్ సమీపంలో దాడులు నిర్వహించారు. ఆర్.దినేష్, యు.భరత్, మెల్విన్ నితీష్, ఒరిస్సాకు చెందిన జోగేంద్రరాబచ్చలను అదుపులోకి తీసుకొని వారి వద్ద ఉన్న మూడు కిలోల గంజాయి ప్యాకెట్లను స్వాధీనం చేసుకున్నారు. దీని విలువ సుమారు 50 వేల వరకు ఉంటుందని తెలిపారు. రేణిగుంట పోలీసు సిబ్బందిని జిల్లా ఎస్పీ ప్రత్యేకంగా అభినందించారు.

గంగమ్మ జాతరలో డాలర్స్ దివాకర్ రెడ్డి

ప్రజాశక్తి -రేణిగుంట: కరకంబాడిలో గురువారం జరిగిన గంగమ్మ జాతరలో తుడా చైర్మన్ డాలర్స్ దివాకర్ రెడ్డి , శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బొజ్జల సుధీర్ రెడ్డితో కలిసి పాల్గొన్నారు.. ఈ సందర్భంగా కరకంబాడి యూత్ డాలర్స్ దివాకర్ రెడ్డి ని ఘనంగా ఆహ్వానించారు. పూలమాల శాలువతో సత్కరించారు.

ప్రజా ఫిర్యాదులను పరిష్కరించండి : కమిషనర్

ప్రజాశక్తి - తిరుపతి టౌన్ : ప్రజల నుంచి అందిన ఫిర్యాదులను ఆయా విభాగాల అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించి పరిష్కరించాలని కమిషనర్ ఎన్.మౌర్య అధికారులను ఆదేశించారు. గురువారం కొర్లగుంట, సాయి విష్ణులేఔట్, ఇఎస్ఐ ఆస్పత్రి, తిరుమల బైపాస్-రోడ్డులోని ప్రాంతాలను పరిశీలించారు. సాయి విష్ణు లేఔట్‌లో నిర్మించిన అపార్టుమెంట్‌లో అన్ని నిబంధనల మేరకు ఉన్నాయా అని మరోమారు పరిశీలించి నివేదిక ఇవ్వాలని ప్లానింగ్ అధికారులను ఆదేశించారు. కమిషనర్ వెంట ఏసిపి మూర్తి, సర్వేయర్ కోటేశ్వర రావు ఉన్నారు.

I SPL. JUDGE
BEFORE THE MOTOR ACCIDENT CLAIMS TRIBUNAL AT CHENNAI
M.C.O.P.No. 5075 of 2024

K. Adi Narayana ...Petitioner.
-Versus-
1. Mr.Shaik Gouse Basha,
2. M/s.The New India Assurance Co.Ltd., ...Respondents.

To
Mr. Shaik Gouse Basha,
S/o. S.Moulali, No.13-10-566, Vivekananda Street, Koralagunta, Tirupathi Urban, Tirupathi District, Andhra Pradesh,
PIN: 517501.
...1st Respondent.

Please take notice that the above M.C.O.P.No.5075 of 2024 is posted for your appearance on 04.07.2025 at about 10.30 A.M. Please be present before the above said Court on that day, failing which the matter will be decided in your absence.

S. HARIDASS,
Counsel for Petitioner.

IN THE COURT OF THE HON'BLE SENIOR CIVIL JUDGE (SENIOR DIVISION) : TIRUPATI
H.M.O.P /0000166/2024

B. Kodanda Rami Reddy ....Petitioner
Vs
Mallu Hemalatha .... Respondent

NOTICE TO THE RESPONDENT

To,
M. Hemalatha, W/o B. Kodanda Rami Reddy,
D.No. 19-8-112/7A,
Hathramji Colony, Bairagipettada,
Tirupati - 5145502.

Please take notice, that the above suit filed by your husband against you for divorce. And the adjournment on 10-07-2025 for your appearance. If you have any objections you may appear before the above said court at 10.30 a.m. on 10-07-2025 either in person (or) through your advocate to file objections. If you fail to do so, the matter will be decided exparte.
Hg. 10-07-2025

S. MANOJ KUMAR, B. Com, LLM.,
SUNITHA.C. RAO, M.A, LLB.,
MUNEETHA.Y, B.A, LLB.,
ADVOCATE, TIRUPATI.
CELL : 9849104141, 9704007399.

IN THE COURT OF THE PRINCIPAL CIVIL JUDGE(JUNIOR DIVISION) :: PUTTUR.
O.S.NO. 301/2021

Between:
1. R. Premanath, S/o Late R. Krishnaswamy Naidu.
2. Smt.R.Sumathi, W/o R.Premanath. ...Plaintiffs.
Residing at PutturTown.
Vs.
And:
1. Smt. G. Sujatha, W/o Late G. Chengalraju.
2. G. Rajesh, S/o Late G. Chengalraju.
3. G. Kalpana, D/o Late G. Chengalraju.
4. G. Priya, D/o Late G. Chengalraju.
All are residing at D.No.18-7-1B, Flot C 118, Kadhi Colony, Opp. Sivashakthi Kalyana mandapam, Tirupati Urban, Chittoor District.
....Respondents/Defendants.

SUIT SUMMONS TO DEFENDANTS BY PUBLICATION

To 1. Smt. G. Sujatha, W/o Late G. Chengalraju.
2. G. Rajesh, S/o Late G. Chengalraju.
3. G. Kalpana, D/o Late G. Chengalraju.
4. G. Priya, D/o Late G. Chengalraju.
All are residing at D.No.18-7-1B, Flot C 118, Kadhi Colony, Opp. Sivashakthi Kalyana mandapam, Tirupati Urban, Chittoor District.
Sir/Madam,

Please take notice that the plaintiffs have filed the above suit against the defendants for recovery of suit claim on the basis of suit pronote executed by the husband of first defendant in favour of plaintiff. The above suit is posted to 02.07.2025 for appearance of defendants in person or through advocate on that day at 10.30 a.m., before this Hon'ble Court. If you fail to appear on that day, the matter will be decided exparte as against you and next steps will be passed in the suit.
This is the order of this Hon'ble Court.

V. UDHAY KUMAR,
ADVOCATE FOR THE PLAINTIFFS.
PUTTUR.

యోగాతో సంపూర్ణ ఆరోగ్యం

ప్రజాశక్తి - గూడూరు టౌన్ : గూడూరు, శ్రీ గాయత్రి ఇంగ్లీష్ మీడియం స్కూల్ అంతర్జాతీయ యోగా దినోత్సవం

పురస్కరించుకొని యోగాంధ్రలో భాగంగా నెల్లూరు ప్రముఖ యోగా మాస్టార్ వెంకురెడ్డి ఆధ్వర్యంలో యోగా సాధన కార్యక్రమము నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కరస్పాండెంట్ శివకుమార్ రెడ్డి, ఉపాధ్యాయులు మస్తాన్, శైలజ, రజని, సుప్రజ, సాయి శ్రీనివాస్, హరిత, యామిని, విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి - గూడూరు టౌన్ : గూడూరు, దువ్వూరు రమణమ్మ మహిళా కళాశాలలో శ్రీ రామచంద్ర మిషన్ హార్ట్ ఫుల్ నేస్

ధ్యాన కేంద్రం సాకారంతో విద్యార్థినిలకు గురువారం యోగా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ హనుమంతరావు మాట్లాడుతూ యోగాతో ఆరోగ్యాన్ని పరిరక్షించుకోవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి -కోట : 21న జరిగే అంతర్జాతీయ యోగా దినోత్సవ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోట తాహసిల్దార్

జే జే రావు ఎంపీడీవో దిలీప్ కుమార్‌లు కోరారు. గురువారం కోట మండలం, తహశీల్దార్ కార్యాలయంలో అన్ని శాఖల మండల అధికారులు హాజరై శనివారం జరగబోవు యోగా దినోత్సవ కార్యక్రమంపై చర్చించారు. ఈ కార్యక్రమంలో మండలంలో సుమారు 140 ప్రదేశాలలో సచివాలయ సిబ్బంది ఇన్చార్జిగా ఉంటూ ప్రజలు, ఉపాధి శ్రామికులు, పొదుపు మహిళలు, గ్రామ పెద్దలు, ప్రజాప్రతినిధులు, అందరు వారి వారి సచివాలయాల్లో ఏర్పాటు చేసిన సెంటర్లో యోగా కార్యక్రమం నిర్వహించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో తాహసిల్దార్ కే.జే జే రావు, ఎంపీడీవో దిలీప్ కుమార్, ఎంఈఓ మస్తానయ్య,ఏ పీ ఓ,ఏపీఎం అనీలా,హౌసింగ్ ఏ ఈ భాస్కర్ రావు, సీడీపీఓ ముని కుమారి, డాక్టర్లు పాల్గొన్నారు.

ప్రజాశక్తి - బుచ్చినాయుడు కండ్రిగ: ప్రతి ఒక్కరూ యోగా ని తమ జీవనశైలిలో భాగంగా చేసుకోవాలని ఎంపీడీఓ వెంకటరత్నమ్మ పిలుపునిచ్చారు. 21న జరగబోయే అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా, యోగాంధ్ర ఉద్యమాన్ని విజయవంతం చేయాలని ఆమె సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ, స్థానిక అధికారులు, ఉపాధ్యాయులు, యోగా గురువులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ : యోగా వల్ల శారీరక మానసిక

రుగ్మతలు తొలగుతాయని డాక్టర్ బి.చంద్రమౌళి అన్నారు. గురువారం పుత్తూరు ప్రభుత్వ డిగ్రీ కళాశాల యోగాభ్యాసం నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ చంద్రమౌళి మాట్లాడుతూ యోగా వల్ల అనేక లాభాలున్నాయన్నారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ జి. కోటేశ్వరయ్య, వీరయ్య, నాగేశ్వరరావు, డాక్టర్ దేవకి, సాంసన్ రాజు, నరసింహులు, డాక్టర్ కృష్ణయ్య, డాక్టర్ వెంకటేశన్ తదితర అధ్యాపకులు, విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి - క్యాంపస్ : తిరుపతిలోని నేషనల్ సంస్కృత విశ్వవిద్యాలయంలోని యోగా విజ్ఞాన విభాగం నుండి యోగా థెరపీలో ఎం.ఎస్సీ (2వ సంవత్సరం) చదువుతున్న శ్రీ రామ చంద్ర శ్రీకాంత్, 17 తేదీన ఆంధ్రప్రదేశ్‌లోని

ఇబ్రహీంపట్నంలోని డాన్ బాస్కో పాఠశాలలో జరిగిన ప్రతిష్టాత్మక యోగాంధ్ర 2025 కార్యక్రమంలో భాగంగా నిర్వహించిన రాష్ట్ర స్థాయి యోగా పోటీలో 2వ స్థానాన్ని పొందారు. ఆయనను వైస్-ఛాన్సలర్ ప్రొఫెసర్ జిఎస్ఆర్ కృష్ణమూర్తి, రిజిస్ట్రార్ కె.వి. నారాయణరావు, యోగా విజ్ఞాన విభాగాధిపతి డా.తపన్ కుమార్ షడై, యోగా విభాగం అధ్యాపకులు డా.ఆర్.లక్ష్మీనారాయణ, డా.అజయ్, సిబ్బంది అభినందించారు.

ప్రజాశక్తి - తడ: యోగ దినోత్సవం సందర్భంగా తడ

మండలంలోని పర్యాటక కేంద్రమైన భీముని వారి పాలెం వద్ద సుమారు 500 మందితో గురువారం యోగ కార్యక్రమం నిర్వహించారు. స్థానిక శాసన సభ్యురాలు నెలవల విజయశ్రీ, రెవిన్యూ డివిజనల్ అధికారి కిరణ్మయి, జిల్లా స్థాయి అధికారులు, మండల స్థాయి అధికారులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ యోగాతో ఆరోగ్య సమస్యల నుండి దూరంగా ఉండవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో పిల్లలు, మహిళలు, తెదేపా నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

యోగాయే ఆరోగ్య రక్ష : సిఐ

ప్రజాశక్తి -తిరుపతి టౌన్ : తిరుమల తిరుపతి బైపాస్ రోడ్డులోని ప్రకాశం మునిసిపల్ పార్క్ నందు యోగాంధ్రలో భాగంగా అసోసియేషన్ ఆధ్వర్యంలో గోపీనాథ్ అధ్యక్షతన పతంజలి యోగా మాస్టర్ ప్రభాకర్‌శెట్టి, గంగాధర్ మాస్టర్,రాజేశ్వరి యోగా టీముల ద్వారా అలిపిరి సిఐ రామకిషోర్ ఆధ్వర్యంలో హంపి థియేటర్‌లో యోగాసనాలు చేశారు. ఈ నెల 21న వైజాగ్‌లో యోగాడే నిర్వహించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించిందన్నారు. రాష్ట్రవ్యాప్తంగాను జయప్రదం చేయాలన్నారు.

'డొక్కా సీతమ్మ' స్ఫూర్తితో అన్నదానం

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి: పేదల ఆకలి తీర్చిన డొక్కా సీతమ్మ స్ఫూర్తితో గురువారం జనసేన ఆధ్వర్యంలో 48వ వారం అన్నదానం చేశారు. స్థానిక పెండ్లి మండపం వద్ద డొక్కా సీతమ్మ అన్నదానం ద్వారా సుమారు 500 మందికి పైగా పేదల ఆకలి తీర్చినట్లు జనసేన నేతలు తెలిపారు. కావలి శివకుమార్, తోట గణేష్, నితీష్ కుమార్ పాల్గొన్నారు.

ఘనంగా రాహుల్ గాంధీ పుట్టినరోజు

ప్రజాశక్తి - తిరుపతి టౌన్ : రాహుల్‌గాంధీ 55వ జన్మదిన వేడుకలను కాంగ్రెస్ నాయకులు యార్లపల్లి గోపి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. గురువారం పాత మున్సిపల్ కార్యాలయం వద్ద ఉన్న రాజీవ్‌గాంధీ విగ్రహం ఎదుట కేక్ కట్ చేసి సంబరాలు జరుపుకున్నారు. యార్లపల్లి గోపీ మాట్లాడుతూ కాశ్మీర్ నుంచి కన్యాకుమారి వరకూ వేల కిలోమీటర్లు పాదయాత్ర చేసిన ఏకైక నాయకుడు రాహుల్‌గాంధీ అన్నారు. 2029లో రాష్ట్రంలో, కాంగ్రెస్‌లో కాంగ్రెస్ పార్టీని అధికారంలోకి తీసుకొచ్చేందుకు నిరంతరం కృషి చేస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు అడ్వకేట్ రవి, మించల తేజవతి, సమీనుల్ల పాల్గొన్నారు.

గురుకుల ప్రవేశాలకు దరఖాస్తులు

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్: జిల్లాలోని బిఆర్ అంబేద్కర్ గురుకుల విద్యాలయాల్లో 2025- 26 విద్యా సంవత్సరానికి గాను 6, 7, 8, 9 తరగతుల్లో మిగిలి ఉన్న సీట్లకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్న జిల్లా కో ఆర్డినేటర్ పద్మజ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలోని బాలుర పాఠశాలలో రామకుప్పం, పూతలపట్టు, విజలాపురం బాలికల పాఠశాలలు చిత్తూరు, పలమనేరు, జీడి నెల్లూరు, కుప్పం మిగిలిన సీట్లు ఉన్నట్లు పేర్కొన్నారు. ఈ పాఠశాలల్లో 6, 7, 8, 9 తరగతుల్లో మిగిలిన సీట్లకు విద్యార్థులు ఆయా విద్యాలయాల్లో దరఖాస్తులు చేసుకోవాలని కోరారు. ఈనెల 25వ తేదీ ఉదయం 10 నుండి 11 గంటల వరకు చిత్తూరులోని బాలికల పాఠశాలలో ప్రవేశ పరీక్ష నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అర్హులైన విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

నేడు జాబ్ మేళా

ప్రజాశక్తి - ఎస్ఆర్ పురం: రాష్ట్ర ప్రభుత్వం నైపుణ్య అభివృద్ధి శిక్షణ విభాగం ద్వారా నిర్వహిస్తున్న జాబ్ మేళా అవకాశాన్ని మండలంలోని నిరుద్యోగులు సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీవో మోహన మురళి తెలిపారు. ఎంపిడిఓ మాట్లాడుతూ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ , ఎంప్లాయిమెంట్ ఎక్చేంజ్, సీడప్, డిఆర్‌డిఏ సంయుక్తంగా ఈనెల 20వ తేదీ శుక్రవారం నియోజకవర్గ కేంద్రమైన గంగాధర నెల్లూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జాబ్ మేళా కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఇందులో 17 కంపెనీలు వారు పాల్గొంటారని, అభ్యర్థుల కనీస అర్హత ఇంటర్, ఐటిఐ డిగ్రీ ఫెయిల్ లేదా పాస్ అయిన వారు, 18 నుంచి 35 సంవత్సరాల వయసు గల నిరుద్యోగ స్త్రీ పురుషులు పాల్గొనవచ్చని తెలిపారు. మరిన్ని వివరాల కోసం అబ్బుల్లా 81425 09017, లోకేష్ 99635 61755లను సంప్రదించాలని కోరారు.

పశువుల దాణా పంపిణీ

ప్రజాశక్తి- బంగారుపాళ్యం: పాడి పరిశ్రమ అభివృద్ధి చేసేందుకు రాయితీతో దాణా పంపిణీ చేపడుతున్నట్లు జెడి ఆరిఫ్ అన్నారు. గురువారం మండలంలోని కాట్టప్పగారిపల్లి గ్రామంలో పశువైద్య సహాయకులు పవన్ ఆధ్వర్యంలో దాణా పంపిణీ కార్యక్రమం జరిగినది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతంలో పాడి పరిశ్రమపై ఆధారపడి జీవిస్తున్నారని, పాడి పరిశ్రమలో అధిక లాభాలు చేకూర్చేందుకు ప్రభుత్వం నుండి 50శాతం రాయితీతో దాణా పంపిణీ చేస్తున్నామని దీనిని ప్రతి ఒక్క పాడి రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

కలాం విగ్రహ ఏర్పాటుకు విరాళం

ప్రజాశక్తి- పుంగనూరు: భరతమాత ముద్దుబిడ్డ దేశ మాజీ రాష్ట్రపతి డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం విగ్రహ ఏర్పాటుకు దాతలు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి విరాళాలు ఇస్తున్నారని కలాం హెల్ప్ ఎడ్యుకేషనల్ చారిటబుల్ ట్రస్ట్ వ్యవస్థాపక అధ్యక్షుడు డాక్టర్ పి.అయూబ్ ఖాన్ చెప్పారు. పుంగనూరుకు చెందిన లయన్స్ త్రిమూర్తి రెడ్డి కలాం విగ్రహ ఏర్పాటుకు తన వంతుగా రూ.10వేలు విరాళంగా ఇచ్చారు. త్రిమూర్తి రెడ్డి మాట్లాడుతూ పట్టణంలో అబ్దుల్ కలాం విగ్రహ ఏర్పాటు గొప్పకార్యమని కొనియాడారు. అయూబ్ ఖాన్ మాట్లాడుతూ విగ్రహ ఏర్పాటు దాతలు విరాళాలు ఇవ్వడంపై హర్షం వ్యక్తం చేశారు.

ఐటిఐ ప్రవేశాలకు దరఖాస్తులు

ప్రజాశక్తి- కార్వేటినగరం: ప్రభుత్వ పారిశ్రామిక (ఐటిఐ) శిక్షణ ప్రవేశం కొరకు రెండవ దశ దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ కే.ఆనంద్ తెలిపారు. గురువారం ఐటిఐ కళాశాలలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ప్రిన్సిపాల్ మాట్లాడుతూ ఐటిఐలో విద్యనభ్యసించడానికి పదో తరగతి ఉత్తీర్ణత సాధించిన వారు అర్హులన్నారు. ఆసక్తి కలిగిన అభ్యర్థులు జులై నెల 15వ తేదీ సాయంత్రం లోపు విద్యార్హత మార్కులిస్టు, అలాగే ఆధార్ కార్డు, కుల ధృవీకరణ, పాస్ ఫోర్ట్ సైజ్ ఫోటోలతో ఐటీఐ కళాశాల కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. దరఖాస్తులు చేసుకున్న అభ్యర్థులకు జులై 21వ తేదీ మెరిట్ ర్యాంకు ప్రకారం ఇంటర్వ్యూలు జరుగుతుందన్నారు. ఇంటర్వ్యూకు హాజరై వారు తమ ఒరిజినల్ సర్టిఫికెట్లతో కార్వేటినగరం ప్రభుత్వ పారిశ్రామిక శిక్షణ సంస్థకు హాజరు కావాలన్నారు. ఇతర వివరాలకు 916001 2999, 91609 60999 సంప్రదించవలన్నారు.

చౌక దుకాణం ఏర్పాటు చేయండి..

ప్రజాశక్తి- పూతలపట్టు: మండలపరిధిలోని బూసిపల్లి దళితవాడకు ప్రత్యేక చౌక దుకాణం ఏర్పాటు చేయాలని ఆ గ్రామానికి చెందిన మహిళలు గురువారం తహశీల్దార్ రమేష్ బాబుకు వినతిపత్రం సమర్పించారు. 186 కార్డుల లబ్ధిదారులు ఉన్నందున గతంలో కోర్టు కూడా తమ గ్రామంలో చౌక దుకాణం ఏర్పాటు చేయాలని ఆర్డర్ ఇచ్చిందని, ఇందుకు సంబంధించి గతంలోని ఆర్డీవో కూడా చౌక దుకాణం ఏర్పాటు చేసే విధంగా అధికారులకు సూచించారని, ఇంటి వద్దకే రేషన్ వస్తున్న కారణంగా పెద్దగా పట్టించుకోలేదని తెలిపారు. అయితే ప్రస్తుతం చౌక దుకాణాల వద్దకు వెళ్లి సరుకులు తెచ్చుకోవాల్సి ఉండగా ఇబ్బందికరంగా ఉందని, కోర్టు అనుమతుల ప్రకారం గ్రామంలో ప్రత్యేక చౌక దుకాణం ఏర్పాటు చేయాలని కోరారు.

సికిల్ సెల్ దినోత్సవంపై అవగాహన

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్: జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ డిటి సుధారాణి ఆదేశాలతో జిల్లా సికిల్ సెల్ నోడల్ అధికారి డాక్టర్ వెంకటప్రసాద్ చిత్తూరు నగర పరిధిలోని గాయత్రి నగర్‌లో గురువారం ప్రపంచ సికిల్ సెల్ దినోత్సవం సందర్భంగా జిల్లా గిరిజన సంక్షేమ రెసిడెన్షియల్ స్కూల్ బాలికలతో ర్యాలీ ద్వారా అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమానికి జిల్లా ట్రైబల్ వెల్ఫేర్ ఆఫీసర్ ఎస్ మూర్తి హాజరయ్యారు. ప్రతి సంవత్సరం ప్రధానమంత్రి జనజాతి ఆదివాసి న్యాయ మహా అభియాన్ కార్యక్రమం కింద జూన్ 19న సికిల్ సెల్‌పై అవగాహన కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా విద్యార్థులందరికీ రక్తపరీక్షలు నిర్వహించడం జరిగిందని, ఎవరికైనా ఈ వ్యాధి లక్షణాలు ఉన్నా, పాజిటివ్ వస్తే వారికి ప్రభుత్వం వారు రూ.10,000లు పెన్షన్ ఇస్తూ మంచి ఆహారం తీసుకునేందుకు ప్రోత్సహిస్తుందని తెలిపారు.

గంగవరం: స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, పత్తికొండ ఆరోగ్య కేంద్ర పరిధిలోని కొంగోళ్లపల్లి గ్రామంలో గురువారం డాక్టర్ మల్లికార్జున్‌రెడ్డి, డాక్టర్ శ్రీనివాసులు ఆధ్వర్యంలో సికిల్ సెల్ అనీమియా నిర్మూలనపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు.

నకిలీ బంగారం కేసులో ఐదుగురికి రిమాండ్

ప్రజాశక్తి- పలమనేరు: పట్టణంలోని ఎద్దులసంత రోడ్డులోని గల కనకదుర్గ గోల్డ్ ఫైనాన్స్ నకిలీ బంగారు కేసులో నగలు తాకట్టు పెట్టి రుణాలు పొందిన కేసుకు సంబంధించి పోలీసులు ఐదు మందిని బుధవారం అదుపులోకి తీసుకున్న ముద్దాయిలు పేర్లు 1. భాను ప్రకాష్, 2. శంకరయ్య, 3. నరేష్ కుమార్, 4. గణేష్, 5. బోసు రెడ్డిపై కేసు నమోదు చేసి రిమాండ్‌కి పంపడం జరిగింది. పలమనేరు సిఐ నరసింహరాజు తెలిపిన మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. ప్రైవేటు బ్యాంకులో పనిచేసే సిబ్బందే నకిలీ బంగారు నగలు తయారు చేయించి బ్యాంకులో రుణం కోసం తాకట్టు పెట్టి, నకిలీ చిరునామాలతో నగదు తీసుకుని స్వాహా చేశారని తెలిపారు. గతేడాది ఆడిట్లో ఈ వ్యవహారం వెలుగులోకి రావడంతో పోలీసులు రంగంలోకి దిగారని, పలమనేరు, పుంగనూరు బ్రాంచుల్లో మొత్తం రూ.8.9 కోట్ల వరకు రుణాలు పొందిన వ్యవహారం వెలుగు చూసిందని తెలిపారు. ఈ ఏడాది మార్చిలో ఈ కేసుకు సంబంధించి 8 మందిని పోలీసులు అరెస్టు చేయగా అదే కేసుకు సంబంధించి కొన్ని లావాదేవీలను గమనించి మరికొందరిని పట్టుకుని విచారిస్తున్నట్లు తెలిపారు. సమగ్రంగా విచారించి కచ్చితమైన నిర్ధారణకు వచ్చిన తరువాత గురువారం వారిపై కేసులు నమోదు చేసి రిమాండ్ పంపుతున్నట్లు తెలియజేశారు.